మంగళవారం
23-04-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 301
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికాలో కాల్పులు... ఇద్దరి మృతి

మెంఫిస్:
అమెరికాలోని మెంఫిస్ నగరంలో ఓ పార్కులో జరుగుతున్న పార్టీలో గుర్తు తెలియని వ్యక్తి విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ఇద్దరు మృతి చెందారు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.
మెంఫిస్ పార్కులో బహిరంగంగా జరుగుతున్న ఓ పార్టీలో శనివారం రాత్రి కాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటన సమయంలో 200 నుంచి 300 మంది పార్టీకి హాజరైనట్లు అధికారులు తెలిపారు.

‘పది’లో 86.69% ఉత్తీర్ణత

- బాలికలదే పైచేయి
- ప్రథమస్థానంలో మన్యం జిల్లా (93.7%)
- అట్టడుగున కర్నూలు జిల్లా (67%)

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్‌లో గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. 86.69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణుల య్యారు. ఇందులో బాలికలదే పైచేయి. ఫలితాల్లో

- మిగతా 2 లో

మోదీ పాలనలో ‘విద్య’ విధ్వంసం

- పాఠ్యాంశాల్లో ‘హిందూత్వ’ చొరబాటు
- చరిత్ర, రాజకీయ శాస్త్రాలను మార్చే కుట్ర
- పాఠశాల విద్య, అక్షరాస్యతకు ఖర్చు చేసింది ఏదీ?
- పాఠశాలల సంఖ్యను తగ్గించేస్తున్న వైనం
- విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు నిలిపివేత

న్యూదిల్లీ :
కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ) 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విధ్వంస పాలన కొనసాగుతోంది. ఈ 10 ఏళ్ల పాలనలో విద్యా వ్యవస్థను ధ్వంసం చేసింది. విద్యను కాషాయీకరణ చేసేందుకు పాఠ్యాంశాల్లో ‘హిందూత్వ’ చొరబాటు పెరిగింది. చరిత్రను, రాజకీయ శాస్త్రాలను మార్చి వేసేందుకు కుట్ర పన్నింది. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు

- మిగతా 2 లో



వలంటీర్ల గండం గట్టెక్కేదెలా?

- రాష్ట్రవ్యాప్తంగా 44 వేల మంది రాజీనామాలు
- వైసీపీ అభ్యర్థుల విజయం కోసం విస్తృత ప్రచారం
- విపక్ష అభ్యర్థుల్లో గుబులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
అనుకున్నదొకటి, అయినది ఇంకొకటి అన్న చందంగా రాష్ట్రంలో వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు విపక్ష అభ్యర్థులకు కునుకు లేకుండా చేస్తోంది. వీరిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచితే తొలుత ఇబ్బంది లేదని భావించినప్పటికీ ఇప్పుడు వారు పెద్దసంఖ్యలో రాజీనామాలకు తెగించడంతో ఈ పరిణామం వారిలో గుబులు రేపుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందజేయడంతోపాటు, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున రాష్ట్రవ్యాప్తంగా దాదాపు మూడున్నర లక్షల మంది వలంటీర్లను నియమిం చారు. నేరుగా సంక్షేమ పథకాల లబ్దిదారులతో ప్రత్యక్ష సంబంధాలు కల్గిన వీరికి వైసీపీ ప్రభు త్వంలో అత్యధిక ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యంగా రాష్ట్రంలో సుమారు 65 లక్షల మంది వృద్ధులు, వితంతవులు, ఒంటరి మహిళలు, వికలాంగులు తదితర పెన్షన్ దారులకు ప్రతి నెలా 1వ తేదీ పింఛన్ సొమ్ము వారి చేతుల్లో పెట్టడం వీరి విధుల్లో అత్యంత ముఖ్యమైంది. అలాగే వలంటీర్ల పరిధిలోని కుటుంబాలకు పెన్షన్, రేషన్, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు కావాలన్నా, భూములకు పట్టాలు ఇతరత్రా అన్ని రకాల సేవలకు వీరే సహాయకులుగా వ్యవహరిస్తున్నారు. ఆయా కుటుం బాలకు సంబంధించిన పూర్తి సమాచారం కూడా వీరి వద్ద ఉంది. ఎవరు ఏ కులం, ఎవరు ఏ పార్టీ, ఎవరు ఏం పనిచేస్తున్నారనే సమగ్ర సమాచారం వలంటీర్ల గుప్పిట్లో ఉంది. దీంతో ఏపీలో ఎన్నికలు సక్రమంగా, సజావుగా సాగాలంటే వీరిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ కేంద్ర ఎన్నికల సంఘానికి వరుస ఫిర్యాదులు చేసింది. మరోవైపు హైకోర్టును కూడా ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం వీరిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది.ఫలితంగా ఏప్రిల్ 1వ తేదీ పెన్షన్ల పంపిణీ ఆలస్యమవడమేగాక, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు 33 మంది ఎండ దెబ్బకు తట్టుకోలేక మృతి చెందారు. టీడీపీ వల్లే వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని... వారికి

- మిగతా 2 లో

‘పది’లో నూజివీడు విద్యార్థినికి
రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్

విశాలాంధ్ర-నూజివీడు టౌన్:
పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ముసునూరు మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన ఆకుల వెంకట సాయి నాగ మనస్వి (599/600 మార్కులు) రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించింది. ఏలూరు జిల్లా నూజివీడులోని నారాయణ విద్యా సంస్థల్లో ఆమె పదో తరగతి ఇంగ్లీష్ మీడియంలో చదివారు. సెకండ్ లాంగ్వేజ్ హిందీలో మినహా మిగతా అన్ని సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులు సాధించింది. తల్లిదండ్రులు నాగ వరప్రసాద్, శైలజ వృత్తిరీత్యా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు. విద్యార్థిని మనస్వి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ర్యాంకు సాధించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉందన్నారు. ఐఐటీలో సీటు సాధించడం తన లక్ష్యమన్నారు.

కేజ్రీవాల్ ఆరోగ్యంపై మెడికల్ బోర్డు

కోర్టు ఆదేశం

న్యూదిల్లీ:
మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యంపై తీవ్ర చర్చ కొనసాగుతోంది. మధు మేహంతో బాధపడుతున్న కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వాలని ఆప్ డిమాండ్ చేస్తుండగా... అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తీహార్ జైలు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే తన వైద్యుడితో రోజూ వీడియో మాధ్యమంలో సంప్రదించే అవకాశం కల్పించాలన్న కేజ్రీవాల్ అభ్యర్థనను కోర్టు తాజాగా తోసిపుచ్చింది. ఆయనకు క్రమం తప్పకుండా ఇన్సులిన్ అవసరమా?, ఇతర ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? అని పరీక్షించేందుకు వైద్యుల కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా దిల్లీ ఎయిమ్స్‌ను

- మిగతా 2 లో

సీపీఐ అభ్యర్థులు రామచంద్రయ్య, చంద్ర నామినేషన్

ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పి.రామచంద్రయ్య, సీపీఐ కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి గాలి చంద్ర సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌కు ముందు కర్నూలు జిల్లా పత్తికొండలోనూ, కడప జిల్లా కమలాపురంలోనూ సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఇతర మిత్రపక్షాలు భారీ ప్రదర్శన నిర్వహించాయి. రామచంద్రయ్య నామినేషన్‌కు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, గాలి చంద్ర నామినేషన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

వైసీపీ, టీడీపీకి ఓటువేస్తే బీజేపీకి వేసినట్లే: నారాయణ

2 లో

గాలి చంద్రను గెలిపించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు

26 వేల మంది టీచర్ల
ఉద్యోగాలు రద్దు

జీతాలు వెనక్కి ఇవ్వాలన్న కలకత్తా కోర్టు

కోల్‌కతా:
పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో కలకత్తా హైకోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ నియామక ప్రక్రియ చెల్లదని స్పష్టం చేసింది. ఆ పరీక్షతో జరిపిన నియామకాలను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించింది. ఉద్యోగాలు సాధించిన టీచర్లు తమ వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలని వెల్లడించింది. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో తొమ్మిది నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సీ, గ్రూప్ డీ స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్రస్థాయి ఎంపిక పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల

- మిగతా 2 లో

రాష్ట్రంలో రాక్షస పాలన: షర్మిల

విశాలాంధ్ర-యర్రగొండపాలెం:
రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, మద్యం నిషేధించి ఓట్లు అడుగుతానన్న జగనన్న ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతున్నాడని ప్రశ్నించారు. రాష్ట్రంలో లిక్కర్, ఇసుక, ల్యాండ్ మాఫియా రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. భూ దందాలు, హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని మండి పడ్డారు. చిన్నాన్నను చంపిన అవినాశ్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇచ్చారంటే న్యాయం ఎక్కడ ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పది సంవత్స రాలు ప్రత్యేక హోదా, ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ, ఇల్లు లేని ప్రతి పేదవారికి రూ.ఐదు లక్షలతో పక్కా గృహం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి రూ.లక్ష చొప్పున ఐదేళ్లకు రూ.ఐదు లక్షలు ఇస్తామన్నారు. మంత్రి సురేశ్ అవినీతిపరుడన్న ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించే పూల సుబ్బయ్య వెలుకొండ ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ రాజశేఖర్ రెడ్డి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అందరూ తలా ఒక పార్టీలో చేరాం కదా!
సంతోషం! ఎన్నికల తరువాత ఏపార్టీ గెలిస్తే
ఆ పార్టీలోకి ఫిరాయించేద్దాం.

మాల్దీవుల్లో ముయిజ్జు పార్టీ ఘన విజయం

మాలే: మాల్దీవుల పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ (పీఎన్‌సీ) ఘన విజయం సాధించింది. అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు ప్రాతినిథ్యం వహిస్తున్న పీఎన్‌సీ మూడింట రెండొంతుల మెజార్టీని సాధించింది. మాల్దీవుల పార్లమెంటు (పీపుల్స్ మజ్లిస్)లోని 93 నియోజక వర్గాలకు ఆదివారం పోలింగ్ నిర్వహించారు. మొత్తం 602 బ్యాలెట్ బాక్సులు ఏర్పాటుచేశారు. వీటితోపాటు మూడు విదేశాల్లో (భారత్‌లోని తిరువనంతపురం, శ్రీలంకలోని కొలంబో, మలేషియాలోని కౌలాలంపూర్) వీటిని ఉంచారు. మొత్తం 2.84 లక్షల ఓటర్లు ఉండగా.. 75 శాతం పోలింగ్ నమోదైంది. ఫలితాల్లో ముయిజ్జుకు చెందిన పీఎన్‌సీ 70 స్థానాలను గెలుచుకోగా.. దాని మిత్రపక్షాలు మూడుచోట్ల విజయం సాధించాయి. భారత్‌కు అనుకూలంగా ఉండే మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సోలికి చెందిన మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (ఎండీపీ) 15 స్థానాలకే పరిమితమైంది. ఈ పార్టీ గతంలో 65 స్థానాలను గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో పీఎన్‌సీ, ఎండీపీ సహా ఆరు పార్టీలకు చెందిన 368 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లను పీఎన్‌సీ గెలుచుకుంది. చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని చెప్పబడుతున్న మహ్మద్ ముయిజ్జుకు ఈ ఎన్నికలు పరీక్షగా నిలిచాయి. ఆయన వైఖరి ప్రజలు సమర్థించినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. పూర్తిస్థాయి ఫలితాలు రావడానికి వారం రోజుల పట్టే అవకాశం ఉండగా... మే మొదటి వారంలో కొత్త పార్లమెంట్ కొలువుదీరనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 41 మంది మహిళలు పోటీ చేయగా... కేవలం ముగ్గురు మాత్రమే విజయం సాధించారని, ఈ ముగ్గురూ ముయిజ్జు పార్టీకి చెందిన అభ్యర్థులేనని స్థానిక మీడియా తెలిపింది. గతేడాది సెప్టెంబరులో జరిగిన మాల్దీవుల అధ్యక్ష ఎన్నికల్లో మహ్మద్ ముయిజ్జు విజయం సాధించిన సంగతి విదితమే. కానీ రద్దయిన పార్లమెంట్‌లో పీఎన్‌సీ దాని మిత్రపక్షాలకు కేవలం 8 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారు. గత ఎన్నికల్లో భారీ విజయం సాధించిన ప్రధాన ప్రతిపక్షం మాల్దీవియన్ డెమొక్రాటిక్ పార్టీ (ఎండీపీ)... ప్రస్తుతం కేవలం 12 సీట్లకు పరిమితమైంది. మరో 10స్థానాల్లో స్వతంత్రులు గెలుపొందారు. మాలే పట్టణంతోపాటు అడ్డు, ఫువాముల్లా పట్టణాల్లోని మెజారిటీ స్థానాలను పీఎన్‌సీ కైవసం చేసుకుంది. తాము ఈ ఫలితాలను ఊహించలేదని ప్రతిపక్ష మాల్దీవుల డెమొక్రాటిక్ పార్టీ పేర్కొంది. ఈ ఎన్నికల్లో మొత్తం 73 శాతం ఓటింగ్ నమోదైనట్లు మాల్దీవుల ఎన్నికల సంఘం ప్రధాని అధికారి ఫాద్ తౌఫీక్ ప్రకటించారు.

చైనా వైపు మొగ్గు

మాల్దీవుల్లో చిన్న ద్వీపాలు కలిపి దాదాపు 1,192 ప్రాంతాలుండగా... ఇవన్నీ 800 కి.మీ. పరిధిలో విస్తరించి ఉన్నాయి. శ్వేతవర్ణపు బీచ్‌లు, రిసార్టులతో కనులపండుగా ఉండే ఈ ప్రాంతం.. హిందూ మహాసముద్రంలో భౌగోళిక రాజకీయాలకు వేదికగా మారింది. కాగా తమ దేశంపై భారత్ ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తున్న ముయిజ్జు... చైనాతో ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకునేందుకు కృషి చేశారు. మూడు నెలల క్రితం చైనాలో పర్యటించి.. అధ్యక్షుడు జిన్ పింగ్‌తో కలిసి రక్షణ సహకారం, ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల ఒప్పందాలపై సంతకాలు చేశారు.

కువైట్‌లో హిందీలో రేడియో ప్రసారాలు

కువైట్‌సిటీ: కువైట్‌లో తొలిసారిగా హిందీలో రేడియో ప్రసారాలు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని కువైట్‌లో భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ప్రతి ఆదివారం రాత్రి 8.30 నుంచి 9 గంటల వరకు ఎఫ్ఎం 93.3, ఎఫ్ఎం 96.3 ఫ్రీక్వెన్సీల్లో హిందీ కార్యక్రమాలు వినవచ్చని పేర్కొంది. హిందీలో కార్యక్రమాలను ప్రసారం చేయడంపై కువైట్ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖపై భారత రాయబార కార్యాలయం ప్రశంసలు కురిపించింది. కువైట్ రేడియోలో హిందీ ప్రసారాలు ప్రారంభం కావడం... రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగు పరుచుకోవడంలో కీలకంగా మారనున్నాయని పేర్కొంది. కాగా చాలా సంవత్సరాలుగా భారత్, కువైట్ మధ్య సత్సంబంధాలు కొనసాగుతూ వస్తున్నాయి. దాదాపు 10లక్షల మంది భారతీయులు కువైట్‌లో నివసిస్తున్నారు. ఇంజినీర్లు, డాక్టర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, శాస్త్రవేత్తలు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లు, టెక్నీషియన్లు, నర్స్, రిటైలర్లు, వ్యాపారవేత్తలు సైతం ఇక్కడ నివాసం ఉంటున్నారు. భారతదేశం చాలాకాలంగా కువైట్‌కు వాణిజ్య భాగస్వామిగా ఉంది.

రికార్డు స్థాయిలో భారతీయులకు అమెరికా పౌరసత్వం

వాషింగ్టన్: అమెరికాలో స్థిరపడిన భారతీయులు అత్యధిక సంఖ్యలో ఆ దేశ పౌరసత్వం పొందారు. 2022లో సహజీకృత పౌరసత్వం (న్యాచురైలేజేషన్ సిటిజన్‌షిప్) కింద సుమారు 66,000 మంది అగ్రరాజ్య పౌరులయ్యారు. ఈ విధానంలో అమెరికా పౌరులుగా మారిన జాబితాలో 1,28,878మంది పౌరులతో మెక్సికో మొదటి స్థానంలో నిలించింది. ఆ తర్వాత 65,960 మంది భారతీయులు అమెరికా సహజీకృత పౌరసత్వం లభించింది. అగ్రరాజ్యంలో 2022 నాటికి 4.6 కోట్ల మంది విదేశీయులు నివసిస్తున్నారు. 33.3 కోట్ల అమెరికా జనాభాలో ఇది 14 శాతానికి సమానం. వీరిలో 2.45 కోట్ల మంది తమని తాము సహజీకృత పౌరులుగా పేర్కొన్నారు. మొత్తంగా 2022లో 9,69,380 మంది ఈ విధానంలో అమెరికా పౌరులుగా మారారని ఇండిపెండెంట్ 'కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్' నివేదిక తెలిపింది. అదే ఏడాదిలో 1,28,878 మంది మెక్సికన్లు అమెరికన్ పౌరులుగా మారారు. తర్వాత భారత్ (65,960), ఫిలిప్పీన్స్ (53,413), క్యూబా (46,913), డొమినికన్ రిపబ్లిక్ (34,525), వియత్నాం (33,246), చైనా (27,038) ఉన్నాయి. అయితే, భారత్‌లో పుట్టి, అమెరికాలో ఉంటున్నవారిలో దాదాపు 42 శాతం మందికి అగ్రరాజ్య పౌరసత్వం పొందే అర్హత లేదని సీఆర్ఎస్ నివేదిక వెల్లడించింది. 2023 నాటికి గ్రీన్ కార్డు లేదా లీగల్ పర్మినెంట్ రెసిడెన్సీ ఉన్న 2,90,000 మంది భారతీయులు సహజీకృత పౌరసత్వం పొందే అవ కాశం ఉందని పేర్కొంది. ఇందు కోసం వచ్చే దర ఖాస్తుల సంఖ్య 2023 ముగిసే నాటికి 4,08,000గా ఉన్నట్లు సీఆర్ఎస్ నివేదిక పేర్కొంది. 2023లో కొత్తగా 8,23,702 మంది ఎల్‌పీఆర్ ఉన్నవారు నేచురలైజేషన్ కింద పౌరసత్వం కోసం దాఖలు చేసుకున్నారు. దాదాపు 90 లక్షల మంది వరకు దానికి అర్హత ఉన్నప్పటికీ, చాలా తక్కువ సంఖ్యలో అప్లికేషన్లు వచ్చాయని నివేదిక వెల్లడించింది. అమెరికాలో సహజీకృత పౌరసత్వం ఇచ్చేందుకు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. జన్మించిన దేశంతో పాటు కనీసం ఐదేళ్ల పాటు ఎల్‌పీఆర్‌లు అయి ఉండాలి. హొండురస్, గ్వాటిమాలా, వెనిజువెలా, మెక్సికో, ఎల్ సాల్వెడార్, బ్రెజిల్ వారికి తక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వియత్నాం, ఫిలిప్పీన్స్, రష్యా, జమైకా, పాకిస్థాన్ పౌరులకు అధిక ప్రాధాన్యం ఉంటుంది.

'పది'లో 86.69% ఉత్తీర్ణత

(మొదటిపేజీ తరువాయి)

పార్వతీపురం మన్యంజిల్లా 93.7శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. కర్నూలుజిల్లా 67 శాతంతో చివరి స్థానంలో ఉంది. విజయవాడలో సోమవారం పదోతరగతి ఫలితాలను విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ విడుదల చేశారు. మార్చి 18వ తేదీ నుంచి 30వరకు 3473 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలను నిర్వహించారు. పరీక్షలు జరిగిన 22 రోజుల్లోనే రికార్డు స్థాయిలో ఫలితాలను ప్రకటించారు. మొత్తం 7 లక్షలమంది విద్యార్థులు పరీక్షలు రాశారు. రెగ్యులర్ విద్యార్థులు 6.23 లక్షల మంది, వారితోపాటు గతేడాది పరీక్షల్లో తప్పిన విద్యార్థులు మరో లక్ష మందికిపైగా ఉన్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 6,16,615 మంది పరీక్షలు రాయగా... 5,34,574 మంది (బాలురు 2,65,267 మంది, బాలికలు 2,69,307 మంది) ఉత్తీర్ణత సాధించారు. కాగా 2,300 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఒక్కరూ పాస్‌కాని పాఠశాలలు 17గా నమోదయ్యాయి. ఈ ఫలితాల్లో ప్రథమ తరగతిలో 69.26 శాతం, ద్వితీయ తరగతిలో 11.87 శాతం, తృతీయ తరగతతిలో 5.56 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందగా... ఏపీ రెసిడెన్షియల్, బీసీ వెల్ఫేర్ స్కూళ్లల్లో 98.43 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. సాంఘిక సంక్షేమ పాఠశాలలు 94.56 శాతం, కస్తూర్బా గాంధీ పాఠశాలలు 88.96, ఆశ్రమ పాఠశాలలు 90.13, జిల్లా పరిషత్ పాఠశాలలు 79.38 శాతం, గిరిజన పాఠశాలలు 89.64 శాతం, ప్రభుత్వ పాఠశాలలు 74.40 శాతం, మున్సిపల్ పాఠశాలలు 75.42 శాతం, ఎయిడెడ్ పాఠశాలల్లో 80.01 శాతం చొప్పున ఉత్తీర్ణత నమోదైంది. పదో తరగతి పరీక్షల పూర్తి వివరాలను జిల్లాల వారీగా ఎస్ఎస్‌సి బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ 2024 పరీక్షలను మే 24 నుంచి జూన్ 3వరకు నిర్వహించనున్నామని పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షల కోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈనెల 23వ తేదీ నుంచి 30వరకు ఫీజు చెల్లించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముంతో మే 1 నుంచి 23వ తేదీ వరకు అవకాశం కల్పించామని వివరించారు. పది పరీక్షల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 23వ తేదీ నుంచి 30వరకు అవకాశం కల్పించామని తెలిపారు. కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ ఘటనలు లేకుండా పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. గత గతేడాది ఉత్తీర్ణత శాతం 72.74 శాతం కాగా ఈ ఏడాది 86.69 శాతం ఉత్తీర్ణత నమోదు అయినట్లు వివరించారు.

రాష్ట్రంలో రాక్షస పాలన: షర్మిల

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో 60 శాతం పూర్తి చేసిందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా ఇదే విషయమై చంద్రబాబును జగన్ నిలదీశాడని, ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పాలన్నారు. చంద్రబాబు, జగన్ చేసింది శూన్యమని, బీజేపీకి మోకరిల్లి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించలేదని, రైతులకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రతి సంక్రాంతికి జాబ్ కాలెండర్ ఇస్తానని చెప్పిన జగనన్న ఒక్కటైనా జాబ్ కాలండర్ ఇచ్చాడా అని ఆమె ప్రశ్నించారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్. నారాయణ మాట్లాడుతూ ఇండియా కూటమి బలపరిచిన వామపక్షాల అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వలస వచ్చిన వారికి వైసీపీ, టీడీపీ అభ్యర్థులకు టికెట్‌లు కేటాయించటంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. స్థానిక సమస్యలు వారికి అసలు తెలియవన్నారు. స్థానికులైన బుదాల అజితారావును, తనను ఆదరించి ఓటు వేయాలని అభ్యర్థించారు. అజితారావు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా యర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధి ఎక్కడ వేసినట్లే గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. సీపీఐ యర్రగొండపాలెం నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూకోర్టుకట్ల రిజర్వాయర్‌కు నిధులు కేటాయించలేదని, పుల్లలచెరువు మండలం చిన్న కండలేరు చెరువుకు పూల సుబ్బయ్య ప్రాజెక్టు ద్వారా తీగలేరు కాలువకు నిధులు కేటాయించి, పనులు మరిచారని విమర్శించారు. శ్రీను, బాలకృష్ణారెడ్డి, కేవీ కృష్ణ గౌడ్,చెన్నయ్య, బాణాల రామయ్య, విశ్వరూపాచారి, జీవీ గురునాథం, తిరుమలయ్య పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి బూదాల అజితారావు ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

ఉద్యోగాలు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

భర్తీ కోసం చేపట్టిన ఈ నియామక పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. అనంతరం ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ పిటిషన్లపై విచారణ నిమిత్తం కలకత్తా హైకోర్టులో ప్రత్యేక డివిజన్ బెంచ్ ఏర్పాటైంది. దీనిపై సుదీర్ఘ విచారణ జరిపిన ఈ ధర్మాసనం... 2016 నాటి టీచర్ల నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగినందున అది చెల్లదని తీర్పు వెలువరించింది. తక్షణమే ఆ నియామకాలను రద్దు చేసి కొత్త నియామక ప్రక్రియ ప్రారంభించాలని పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు సూచించింది. నాటి వ్యవహారంపై మరింత సమగ్ర దర్యాప్తు జరిపి మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయంలో 2016 ఉపాధ్యాయ నియామక ప్రక్రియతో ఉద్యోగాలు పొందిన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నాలుగు వారాల్లోగా తాము అందుకున్న వేతనాలు తిరిగి ఇచ్చేయాలని ఆదేశించింది. ఆ డబ్బు వసూలు బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని సూచించింది.

8 ఏళ్ల జీతం 4 వారాల్లో తిరిగివ్వాలా: మమత

పశ్చిమ బెంగాల్‌లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ ద్వారా నియమి తులైన 26 వేల మంది ఉద్యోగాలను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఉద్యోగాలు రద్దు చేయడంతో పాటు వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలన్న కోర్టు ఆదేశాలను సవాలు చేస్తామని తెలిపారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర బెంగాల్‌లోని రాయ్‌గంజ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మమత పాల్గొన్నారు. కోర్టు తీర్పుపై మీడియాతో మాట్లాడారు.

వైసీపీ, టీడీపీకి ఓటువేస్తే బీజేపీకి వేసినట్లే

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు/పత్తికొండ: వైసీపీ, టీడీపీకి ఓటువేస్తే బీజేపీకి ఓటు వేసినట్లేనని, నరేంద్ర మోదీకి వైసీపీ అధినేత జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ద్వారపాలకులుగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సోమవారం పత్తికొండలో సీపీఐ అభ్యర్థి పి.రామచంద్రయ్య నామినేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి నారాయణ ప్రసంగిస్తూ, వైసీపీ, టీడీపీ నాయకులు ఎవరు గెలిచినా మోదీకి అనుకూలంగా వ్యవహరిస్తారని విమర్శించారు. 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే హిందూవుల ఆస్తులు అమ్మివేస్తారని మోదీ అంటున్నారని, మోదీ గెలిచిన తరువాత ప్రభుత్వ రంగ ఆస్తులను ఎవరు అమ్మివేస్తున్నారో అందరికీ తెలుసునన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబాన్ని విమర్శించే అర్హత మోదీకి లేదని, ఆ కుటుంబం త్యాగం చేసిందని, లౌకికవాదాన్ని అనుసరించిందని తెలిపారు. వైసీపీ, టీడీపీ నాయకులు గెలిచిన తరువాత వారి ఆస్తులు పెంచుకుంటున్నారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. జెడ్ కేటగిరీ భద్రతలో జగన్ మోహన్ రెడ్డిపై రాళ్లతో హత్యాయత్నం చేశారని చెప్పడం జగన్నాటక మన్నారు. ఎన్నికల సమయంలో సీఎం జగన్ కొత్తనాటకం అడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్, చంద్రబాబు, మోదీ రోజుకో వేషం వేస్తున్నారని విమర్శించారు, ఫ్యాక్షనిజం, పెత్తందారులకు సీపీఐ నేత చదువుల రామయ్య వణుకు పుట్టించారన్నారు. సాగునీరు వస్తే ఈ ప్రాంతంలో ఫ్యాక్షన్ ఉండదన్నారు. సీపీఐ అభ్యర్థి పి.రామచంద్రయ్య ఈ ప్రాంతంలో సాగునీటి కోసం అనేక పోరాటాలు చేశారని అన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు కోసం ఎన్టీ రామారావు ప్రతిపాదనలు పెడితే, దానిని రాజశేఖర్ రెడ్డి ముందుకు తీసుకుపోయారన్నారు. చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డి ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని అన్నారు. సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. 'ఇండియా' కూటమిలో భాగస్వాములైన సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కంకీ కొడవలి, హస్తం గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, సీపీఐ పత్తికొండ అభ్యర్థి పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు ప్రభుత్వ అతిథి గృహం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రజానాట్య మండలి కళాకారుల డప్పుచప్పుళ్లు, నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. సీపీఐ శ్రేణులు ఎర్రజెండాలను చేతపట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించడంతో పత్తికొండ పురవీధులు ఎరుపుమయం అయ్యాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, సీపీఐ ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మోదీ విధానాలు ప్రమాదకరం

మోదీ విధానాలు ప్రమాదకరంగా ఉన్నాయని, దేశాన్ని కాషాయికరణగా మార్చేందుకు కుట్రలు పదుతున్నారని కె.నారాయణ విమర్శించారు. పత్తికొండలో చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ మరో సారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చి వేసి, కాషాయ రాజ్యాంగాన్ని అమలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై సీబీఐ, ఈడీని ఉపయోగించి రాజకీయ బెదిరింపులకు పాల్పడుతూ జైలుకు పంపుతున్నారని విమర్శించారు. ఏపీకి విభజన హామీల అమలు, వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి ఊసే లేదన్నారు. సీపీఐ అసెంబ్లీ అభ్యర్థి పి.రామచంద్రయ్య మాట్లాడుతూ తనను గెలిపించినట్లయితే పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ 'ఇండియా' కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, నక్కి లెనిన్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, జిల్లా మాజీ కార్యదర్శి పి.భీమ లింగప్ప, మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్ పాల్గొన్నారు.

వలంటీర్ల గండం గట్టెక్కేదెలా?

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన సంస్థ ఫిర్యాదులు చేసి కోర్టును ఆశ్రయించడం వల్లే వృద్ధులు ప్రాణాలు కోల్పోవల్సి వచ్చిందని వైసీపీ దుమ్మెత్తి పోసింది. వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఈసీ తీసుకున్న నిర్ణయం లక్షల సంఖ్యలో ఉన్న పెన్షన్‌దారులు, వారి కుటుంబసభ్యుల్లో తమపై వ్యతిరేకత పెంచే పరిస్థితి ఏర్పడిందని భావించిన టీడీపీ అధినేత చంద్రబాబు వెంటనే దిద్దుబాటు చర్యలకు దిగారు. టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్లను తొలగిస్తారన్న భయాన్ని వారిలో తొలగించే ప్రయత్నాలు చేశారు. వలంటీర్లను కొనసాగిస్తామని, పైగా వారి జీతాన్ని రెట్టింపు చేసి నెలకు రూ.10 వేలు చెల్లిస్తామని ప్రకటించడం ద్వారా వారిలో భరోసా నింపే ప్రయత్నం చేశారు. అలాగే వృద్ధులకు సచివాలయ ఉద్యోగుల ద్వారా నేరుగా పెన్షన్ ఇంటికే పంపిస్తామని, ఏప్రిల్ నెల నుంచే రూ.4వేలు ఇస్తామని ప్రకటించారు. కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు కూడా వలంటీర్లలో వ్యతిరేకత లేకుండా చూసేందుకు వారికి అనుకూలంగా విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ నేపథ్యంలో వైసీపీ తన వ్యూహాన్ని మార్చి వలంటీర్లను పూర్తిస్థాయిలో ఎన్నికలకు వినియోగించుకునేందుకు వారితో రాజీనామాలు చేయించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. వీరి పదవీ కాలం ఎలాగూ జులైతో ముగుస్తున్నందున... వారికి ఈ మూడు నెలలపాటు వైసీపీ అభ్యర్థులే రెట్టింపు జీతాలు చెల్లించడంతోపాటు ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో మరలా కొనసాగించేలా హామీలు ఇస్తూ రాజీనామాలు చేపిస్తున్నారు. ప్రస్తుతం వలంటీర్ల రాజీనామాల పర్వం రాష్ట్రంలో ఓ ప్రహసనంలా కొనసాగుతోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా రాజీనామాలు చేసిన వలంటీర్ల సంఖ్య ఇప్పటికే 44 వేలు దాటిపోయింది. వీరంతా రాజీనామాలు చేశాక వైసీపీ అభ్యర్థుల విజయానికి స్వేచ్ఛగా పనిచేసుకుంటున్నారు. ఈ పరిణామం కూటమి అభ్యర్థులకు కునుకు లేకుండా చేస్తోంది. టీడీపీ ప్రభుత్వం వస్తే రూ.10వేలు ఇస్తామని, ఉద్యోగం కొనసాగిస్తామని హామీ ఇస్తూ కొంతమందితో కూటమి అభ్యర్థులు కూడా రాజీనామాలు చేపించే ప్రయత్నాలు చేపిస్తున్నప్పటికీ వైసీపీ రాజీనామాల వ్యూహం వారికి వెన్నులో వణుకు పుట్టిస్తోంది. వలంటీర్ల గండాన్ని ఏ విధంగా గట్టెక్కాలనే దానిపై కూటమి నేతలు దృష్టి సారించారు. దీనిపై సోమవారం హైకోర్టులో బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పిటిషన్ దాఖలు చేశారు. రాజీనామాలు చేసిన వలంటీర్లు ఎన్నికలను ప్రభావితం చేయబోతున్నారని తన పిటిషన్ లో పేర్కొన్నారు. వీరు అలా చేయకుండా అడ్డుకోవాలని హైకోర్టును కోరారు. రాష్ట్రంలో 44 వేల మందికి పైగా వలంటీర్లు వైసీపీ ఆదేశాల మేరకు రాజీనామాలు చేసి వారికి ఎన్నికల్లో సహకరిస్తున్నారని... కాబట్టి వారి రాజీనామాలు ఆమోదించకుండా ఆదేశాలు ఇవ్వాలని యాదవ్ కోరారు. దీనిపై హైకోర్టు మంగళవారం విచారణ జరపనుంది.

మోదీ పాలనలో 'విద్య' విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

విద్యాభివృద్ధికి కృషి చేస్తామని, ఇందులో భాగంగా బాలికలపై ప్రత్యేక దృష్టితో 'అవకాశాల సమానత్వం' పై వాగ్దానం చేసింది. జీడీపీలో 6 శాతం మొత్తాన్ని విద్యకు ఖర్చు చేస్తామని, ఉపాధ్యాయులు, పరిశోధకుల కొరతను తీర్చేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని మోదీ సర్కార్ చెప్పుకొచ్చింది. అయితే మోదీ నేతృత్వంలోని ఒక దశాబ్దపు పాలనలో హిందుత్వ కథనానికి సరిపోయేలా పాఠ్య పుస్తకాల్లో, ముఖ్యంగా చరిత్ర, రాజకీయ శాస్త్రంలో మార్పు చేయడంలో అత్యంత చురుకైన చర్యలు కనిపించాయి. ఇది అట్టడుగు వర్గాలు విద్యను పొందడంలో అంతరాయం కలిగించింది. జాతీయ నూతన విద్యా విధానం (ఎన్ఈపీ)-2020 ప్రకారం, ప్రభుత్వ పాఠశాలల ఏకీకరణ ఇటీవలి సంవత్సరాలలో పెరిగింది. ఇది విద్యా హక్కు చట్టం ముఖ్య దెబ్బతీస్తోందని ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ నెట్‌వర్క్ ఇండియా (ఫ్యాన్-ఇండియా) ద్వారా 'ఎడ్యుకేషన్ రిపోర్ట్ కార్డ్-2014-24' పేర్కొంది. ఇది పౌర సమాజ సంస్థలు, యూనియన్లు, ప్రజా ఉద్యమాలు, సంబంధిత పౌరుల సమష్టి సంస్థ. '2023లోనే దేశవ్యాప్తంగా 4 వేల పాఠశాలలను విలీనం చేశారు. ఇది అనేక మంది పిల్లలను ప్రభావితం చేసింది. మహారాష్ట్ర పాఠశాలల విలీనాన్ని ప్రకటించింది. ఇది దాదాపు 2 లక్షల మంది పిల్లలపై ప్రభావం చూపగా, ఒడిశా 7,478 పాఠశాలలను మూసివేసింది. ఈ చర్యలు ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో విద్యా ప్రవేశం, విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడిచేలా ఉందని ఆందోళన నెలకొందని పేర్కొంది. 'విద్య పొందే' అవకాశాలను మెరుగుపరుస్తామని మోదీ ప్రభుత్వం చేసిన వాగ్దానానికి విరుద్ధంగా, '2018-19.... 2021-22 మధ్య దేశంలో మొత్తం పాఠశాలల సంఖ్య 15,51,000 నుంచి 14,89,115 కి పడిపోవడంతో 61,885 కు తగ్గిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత ముఖ్యమైన క్షీణత కనిపించింది. 61,361 పాఠశాలలు మూతపడ్డాయి. ప్రయివేటు పాఠశాలల సంఖ్య పెరగడంతో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఇది అట్టడుగు వర్గాలకు విద్యను పొందడం పెద్ద ప్రశ్నగా మారుస్తుంది. 2014-15లో దేశవ్యాప్తంగా 11,07,118 ప్రభుత్వ పాఠశాలలు, 83,402 ప్రభుత్వ-ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల సంఖ్య 2021-22లో వరుసగా 10,22,386, అలాగే 82,480 కి తగ్గింది. మరోవైపు, 2014-15లో ప్రైవేట్ పాఠశాలల సంఖ్య 2,88,164 కాగా, 2021-22 నాటికి 3,35,844కి పెరిగి 47,680 పెరిగాయి.

ఉపాధ్యాయులు... పరిశోధకులు ఏరీ?

దేశంలో ఉపాధ్యాయులు, పరిశోధకుల కొరత తీవ్రంగా ఉందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికను ఉటంకిస్తూ 'ఫాన్-ఇండియా' నివేదిక పేర్కొంది. 10 లక్షల మంజూరైన 62.71 లక్షల పోస్టులు రాష్ట్ర స్థాయిలో ఖాళీగా ఉన్నాయని పేర్కొంది. ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో నియామక లేఖల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం పరీక్షలకు దరఖాస్తు చేసిన, అర్హత పొందిన అభ్యర్థుల వివిధ ఆందోళనల నివేదికల ద్వారా ఇది చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాథమిక నుంచి ఉన్నత స్థాయి వరకు అన్ని స్థాయిలలో క్షీణతను కనుగొంది. జీఈఆర్ ప్రాథమిక స్థాయిలో 103.39 తగ్గి ఉన్నత స్థాయిలో 57.56కు చేరుకుంది. అత్యంత నష్టపోయిన అట్టడుగు వర్గాల విషయానికొస్తే... షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు), ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీలు), మైనార్టీలు. 2022లో, 2022-23 విద్యా సంవత్సరానికి ఎస్టీలు, ఎస్సీటలు, ఓబీసీలు, మతపరమైన మైనారిటీలకు 1-8 తరగతులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు నిలిచిపోయాయని పేర్కొంది.

గాలి చంద్రను గెలిపించండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు
- భారీ ప్రదర్శనతో సీపీఐ అభ్యర్థి నామినేషన్

విశాలాంధ్ర-కమలాపురం: 'ఇండియా' కూటమి బలపరుస్తున్న కమలాపురం అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి గాలి చంద్రను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు ప్రజలను కోరారు. సోమవారం వైఎస్సార్ జిల్లా కమలాపురం అడ్డరోడ్డు నుంచి సీపీఐ శ్రేణులు, నాయకులు ఎర్రజెండాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గాలి చంద్ర నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ రెండు ప్రజాస్వామ్య వ్యవస్థలను ఖూనీ చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ తన అంతర్గత అజెండాను దేశ ప్రజలపై రుద్దుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని తెలిపారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయాయని, నిత్యావసరాల ధరలు నింగినంటాయన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని అన్నారు. మోదీ సర్కార్ సీబీఐ, ఈడీ, ఐటీ వ్యవస్థలను తన చెప్పు చేతల్లో పెట్టుకుని ప్రతిపక్ష నాయకులపై అక్రమంగా కేసులు పెట్టడం, వాళ్లను జైళ్లలో నిర్బంధించడం చేస్తోందన్నారు. ఇదంతా దేశ ప్రజలు గమనిస్తున్నారని, బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం నుంచి నియంతృతంలోకి పోతుందని భయాందోళన గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని అటకెక్కించిందన్నారు. అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపడతామని, కడప కొప్పర్తి పారిశ్రామిక వాడలో భారీ, మధ్య ,చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఊదరగొట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈ నాలుగున్నర సంవత్సరాలలో చేసింది ఏమీ లేదన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి నియోజకవర్గ ప్రజల సమస్యలు పక్కన పెట్టి భూ కబ్జాలు, దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడుతూ కోట్లు రూపాయలు దోచుకున్నారని ధ్వజమెత్తారు. నేటికీ అనేక గ్రామాలలో కనీసం తారు రోడ్డు, సీసీ రోడ్డు కూడా లేని దుస్థితి ఉందన్నారు. రైతుల ప్రయోజనాల కోసం నిర్మించిన నీటిపారుదల ప్రాజెక్టులను తన ప్రయోజనాల కోసం చేపల చెరువుల కోసం వాడుకుంటున్నారని విమర్శించారు. అన్ని రకాల మాఫియాకు పాల్పడుతున్న వాళ్లు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, అటువంటివారిని ప్రజలు ఓడించి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే సీపీఐ అభ్యర్థి గాలి చంద్రను గెలిపించాలన్నారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ వెంకటసుబ్బయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి జి.నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.వేణుగోపాల్, ఎన్.వెంకటశివ, వి.వీరశేఖర్, ఎంవీ సుబ్బారెడ్డి, ఎల్.నాగసుబ్బారెడ్డి, బషీరున్నిసా, సి.సుబ్రహ్మణ్యం, శ్రీరాములు, కేసీ బాదుల్లా, వి.గంగా సురేష్, సీపీఐ నాయకులు ఎ.వి.శివరామ్, వెంకట రామ్, కాంగ్రెస్ నాయకులు విష్ణుప్రీతమ్ రెడ్డి, బాబు, సీపీఎం నాయకులు రామ్మోహన్ రెడ్డి, దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ ఆరోగ్యంపై మెడికల్ బోర్డు

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించింది. అంతకుముందు తీహార్ జైలు సూపరింటెండెంట్‌కు కేజ్రీవాల్ లేఖ రాశారు. మధుమేహం దృష్ట్యా రోజూ ఇన్సులిన్ అడుగుతున్నట్లు స్పష్టంచేశారు. పైగా.. తన డయాబెటీస్ పరిస్థితి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎయిమ్స్ వైద్యులు ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఎయిమ్స్ డాక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడినప్పుడు ఇన్సులిన్ విషయాన్ని కేజ్రీవాల్ లేవనెత్తలేదని, వైద్యులు కూడా సూచించలేదని జైలు అధికారులు ప్రకటించడంతో ఈ మేరకు స్పందించారు. జైలు అధికారులు చెప్పిందంతా అబద్ధమని, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తప్పుడు ప్రకటన విడుదల చేశారని ఆరోపించారు. '10 రోజులుగా ఇన్సులిన్ అడుగుతున్నాను. నన్ను చూసేందుకు వచ్చిన ప్రతీ వైద్యుడికి అధిక షుగర్ లెవల్స్ చూపించాను. అత్యధికంగా 250-320 మధ్య నమోదవుతోంది. ఉదయం ఏమీ తినకముందు 160-200 స్థాయిలో ఉంటోంది. రోజూ ఇన్సులిన్ కోసం విజ్ఞప్తి చేసినప్పటికీ... అడగలేదని ఎలా అంటారు' అని ఢిల్లీ సీఎం ప్రశ్నించారు. ఆరోగ్య కారణాల కింద బెయిల్ పొందేందుకే ఆయన చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటున్నారని ఈడీ ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే. మరోవైపు... ఆరోగ్య సేవలు నిరాకరించి ఆయన్ను చంపాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటోందని సునీత కేజ్రీవాల్ ఆరోపించారు.

నిరంకుశ బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలి

బీవీ రాఘవులు, ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర-మంగళగిరి: దేశంలో మతోన్మాదంతో నిరంకుశ పాలన సాగిస్తున్న బీజేపీని దేశంలోనూ, రాష్ట్రంలోనూ చిత్తుగా ఓడించాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇండియా కూటమి బలపర్చిన మంగళగిరి అసెంబ్లీ సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు నామినేషన్ సందర్భంగా సోమవారం మంగళగిరిలోని చిల్లపల్లి నాగేశ్వరావు కళ్యాణ మండపంలో జరిగిన బహిరంగ సభలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అధ్యక్షత వహించారు. రాఘవులు మాట్లాడుతూ... గెలిస్తే శాసనసభలో ప్రజా సమస్యలపై పోరాడతామని... ఓడితే రోడ్డుపై పోరాటం చేస్తామన్నారు. బీజేపీ దేశంలో ఉన్న ఏ పార్టీని ఎదగనివ్వదని... కుట్రలతో చీలికలు పేలికలు చేస్తుందని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ దాని మిత్రులను, వైసీపీని ఓడించాలన్నారు. అమరావతి రాజధానిగా కావాలంటే మంగళగిరి నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థికి ఓట్లేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. గుంటూరు పార్లమెంటుకు పోటీ చేస్తున్న సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌కు, ఇతర ప్రాంతాల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యం పోరాడే మంగళగిరి అసెంబ్లీ సీపీఎం అభ్యర్థి శివశంకర్‌ను, గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో పేదల భూముల కోసం పారిస్ కంపెనీపై జొన్న శివశంకర్‌తో కలిసి పోరాడానని చెప్పారు. అప్పుడు అరెస్టులు కూడా జరిగాయన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ వైసీపీ, ప్రతిపక్ష టీడీపీలకు రాష్ట్ర ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. 2014 ముందు గ్యాస్ రేటు రూ.400లు ఉంటే రూ.25లు పెంచితే మోదీ, బీజేపీ నాయకులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేశారని... నేడు గ్యాస్ ధర రూ.1000 ఉందని చెప్పారు. నిత్యవసర వస్తువుల ధరలన్నీ విపరీతంగా పెంచారని విమర్శించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు పి.మధు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో ఉన్న టీడీపీ, వైసీపీలు ఎదిరించి మాట్లాడలేని స్థితిలో ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మోదీ విధానాలకు మద్దతు పలుకుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక విధానాలన్నిటిని బలపరుస్తూ రాష్ట్రంలో అమలు చేయడానికి పూనుకుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.శామ్యూల్ మాట్లాడుతూ ప్రజలకు అండదండలుగా ఉండే కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేస్తాయన్నారు. తాడేపల్లి మండలంలో అనేక సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు చేసిన కృషిని మరువలేమని అన్నారు. మంగళగిరి అసెంబ్లీ సీపీఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా మంగళగిరి కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు పెంచారన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఆస్తి పన్ను తగ్గిస్తామని, చెత్త పన్ను రద్దు చేస్తామని చెప్పారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, ఎం.సూర్యారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చంగయ్య, వై.నేతాజీ, ఎస్.భవన్నారాయణ, కె.నళిని కాంత్, ఈమని అప్పారావు, సీపీఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, వై.వెంకటేశ్వరరావు, జాలాది జాన్ బాబు, తుడిమెల్ల వెంకటయ్య, అన్నవరపు ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వరరావు, గుంటక సాంబిరెడ్డి, చిన్ని సత్యనారాయణ, సీపీఎం సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, ఎం.పకీరియా, పి.బాలకృష్ణ, బి.కోటేశ్వరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.కృష్ణ చౌదరి, కంటేటి జీవన్ సాగర్, కె.రాధిక, సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకులు కె.ఉమామహేశ్వరరావు, పి.మురళీకృష్ణ, ఎస్.వెంకటరావు, సీపీఎం నాయకులు వీవీ జవహర్‌లాల్, వి.రాణి, సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి డి.వెంకట్ రెడ్డి, ఐద్వా నాయకురాలు డి.శ్రీనివాస్ కుమారి, మంగళగిరి పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, రూరల్ కార్యదర్శి ఎం.జ్యోతిబాస్, తాడేపల్లి మండలం సీపీఎం సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, ఆవాస్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిస్తీ, సీపీఐ నాయకులు పి.నాగేశ్వరరావు, మైనార్టీ నాయకులు ఎండీ యూసుఫ్, సీఐటీయూ నాయకులు ఆర్‌వీ నరసింహారావు, నిమ్మగడ్డ బాల ప్రకాష్, నన్నపనేని శివాజీ, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఈదా ప్రతాపరెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు ఏ.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు. కాగా జొన్నా శివశంకరరావుకు డిపాజిట్ రూ.10 వేలను ఆటో యూనియన్ నాయకులు టి.శ్రీరాములు తదితరులు అందించారు.

కాంగ్రెస్ రెండో జాబితా విడుదల

38 మందితో అసెంబ్లీ సీట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ రెండో జాబితా విడుదలైంది. ఇండియా కూటమి తరపున అసెంబ్లీకి పోటీ చేసే మరో 38 మంది అభ్యర్థుల జాబితాను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం వెల్లడించారు. వైసీపీ నుంచి వచ్చిన ఆమంచి కృష్ణమోహన్‌కు చీరాల టికెట్ దక్కింది. విజయవాడ తూర్పు అసెంబ్లీ అభ్యర్థిగా సుంకర పద్మశ్రీకి సీటు ఖరారు చేశారు. ఇంతకుముందు ప్రకటించిన తొలి జాబితాలోని 10 మంది అభ్యర్థులను మార్చారు. శ్రీకాకుళం, గజపతినగరం, తాడికొండ (ఎస్సీ), ఒంగోలు, కనిగిరి, కొవ్వూరు, సర్వపల్లి, గూడూరు (ఎస్సీ), సూళ్లూరుపేట (ఎస్సీ), హిందూపురం అసెంబ్లీలో మార్పులు, చేర్పులుచేశారు. కాంగ్రెస్ తొలి, మలి విడత జాబితాలతో మొత్తం 142 అసెంబ్లీ స్థానాలను, 20 లోక్‌సభ స్థానాలను ప్రకటించింది. 175 అసెంబ్లీ స్థానాల్లో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలైన సీపీఐ, సీపీఎంకు రెండు లోక్‌సభ, 16 అసెంబ్లీ స్థానాలను పొత్తులో భాగంగా సీట్లను కాంగ్రెస్ సర్దుబాటు చేసింది. ఇంకా మిగిలిన లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ జాబితాలను విడుదల చేయాల్సి ఉంది. అసెంబ్లీ అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం- అంబటి కృష్ణారావు, బొబ్బిలి-మరిపి విద్యాసాగర్, గజపతినగరం -డోలా శ్రీనివాస్, నెల్లిమర్ల-సరాగడ రమేశ్‌కుమార్, విశాఖపట్నం నార్త్-లక్కిరాజు రామారావు, చోడవరం-జగతి శ్రీనివాస్, యలమంచిలి-తార్ నరసింగ్‌రావు, గన్నవరం (ఎస్‌సి)-కొండేటి చిట్టిబాబు, అచంట-నెక్కంటి వెంకట సత్యనారాయణ, విజయవాడ ఈస్ట్- సుంకర పద్మశ్రీ, జగ్గయ్య పేట- క్రాంతి అప్పారావు, తాడికొండ (ఎస్సీ)- మనిచాల సుశీల్ రాజా, రేపల్లె- మోపిదేవి శ్రీనివాసరావు, తెనాలి- షేక్ బషీద్, గుంటూరు వెస్ట్-డాక్టర్ రాజ చాకొండ జాన్‌బాబు, చీరాల- ఆమంచి కృష్ణ మోహన్, ఒంగోలు- తురకపల్లి నాగలక్ష్మీ, కనిగిరి- దేవరపల్లి సుబ్బారెడ్డి, కావలి- పొదలకూరి కల్యాణ్, కొవ్వూరు-నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్వేపల్లి-పీవీ శ్రీకాంత్‌రెడ్డి, గూడూరు (ఎస్‌సి)- డాక్టర్ యు.రామకృష్ణారావు, సూళ్లూరుపేట (ఎస్‌సి)- చందనమూడి శివ, వెంకటగిరి- పంతా శ్రీనివాసులు, కడప-తుమన్ కాల్ యాల్ అజల్ అలీఖాన్, పులివెందుల-మూలంరెడ్డి దరువకుమార్‌రెడ్డి, జమ్మలమడుగు-పాముల బ్రహ్మానందరెడ్డి, ప్రొద్దుటూరు- షేక్ పూలా మహ్మద్ నజీర్, మైదకూరు- గుండ్లకుంట శ్రీరాములు, ఆళ్లగడ్డ-బారగొడ్ల హుస్సేన్, శ్రీశైలం- అసర్ సయ్యద్ ఇస్మాయేల్, బంగనపల్లె-గౌతమ్ పుల్లయ్య, డోన్-గార్లపాటి మధులేటి స్వామి, ఆందోని-గొల్ల రమేశ్, ఆలూరు - నవీన్ కిశోర్ ఆరకట్ల, కళ్యాణదుర్గ- పి.రాఘూపాల్‌రెడ్డి, హిందూపురం - మహ్మద్ హుస్సేన్ ఇంతియా తుల్లా, ధర్మవరం- రంగన అశ్వర్థ నారాయణ.

పది ఫలితాల్లో తిరుమల విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో తిరుమల ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు చెప్పారు. వి.సందీప్ 597 మార్కులు, కె.మోహిత్ గుప్తా 596 మార్కులు, కె.రఘువీర్, కె.సుప్రియ, జి.దేదీప్య, పీటీ నాగేంద్రవర్మ 595 మార్కులు సాధించారని, 590పైన 66 మంది విద్యార్థులు, 580పైన 430 మంది విద్యార్థులు, 570పైన 800 మంది విద్యార్థులు, 560పైన 1088 మంది విద్యార్థులు, 550పైన 1318 మంది విద్యార్థులు, 500పైన 1898 మంది విద్యార్థులు సాధించారని వివరించారు. తమ స్కూలు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను డైరెక్టర్ నున్న సరోజినీదేవితో కలిసి ఆయన అభినందించారు.

మోదీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

కూటమి అభ్యర్థి గౌస్ మొహిద్దీన్‌ను గెలిపించండి: రావుల

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతుందని, మోదీ పాలనకు చరమగీతం పాడాలంటే ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. ఇండియా కూటమి బలపరిచిన కందుకూరు కాంగ్రెస్ అభ్యర్థి గౌస్ మొహిద్దీన్ నామినేషన్ కార్యక్రమానికి విచ్చేసిన రావుల మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ నాయకులకు అయినా బుద్ధి చెప్పాలంటే ప్రజలకు ఉన్న ఏకైక ఆయుధం ఓటు అని ఆ ఓటును సక్రమమైన మార్గంలో వినియోగించుకుంటే ప్రతి ఒక్కరి భవిష్యత్తు బంగారు బాటగా ఉంటుందని అన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. యువత ఉపాధి లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. సంక్షేమ ఫలాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను కేంద్రం మెడలు వంచి తీసుకువస్తానని చెప్పి ఐదేళ్లయినా ఆ ఊసే లేదని అన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని అటువంటి వ్యక్తికి తిరిగి ఓటు వేసి గెలిపిస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని బీజేపీకి ధారాదత్తం చేస్తాడని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీని విమర్శించిన చంద్రబాబు నాయుడు 2024లో అదే పార్టీతో పొత్తు పెట్టుకుని ముందుకు సాగటం సిగ్గుచేటని ఆయన అన్నారు. రాష్ట్రం బాగుపడాలన్న, అభివృద్ధి చెందాలన్నా ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

మల్లన్న సేవలో చంద్రబాబు

విశాలాంధ్ర-శ్రీశైలం: కర్నూలు జిల్లా శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామిని సోమవారం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల నాగరాజు, శ్రీశైలం, బనగానపల్లె ఎమ్మెల్యే అభ్యర్థులు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బీసీ జనార్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి ఉన్నారు. తొలుత చంద్రబాబు దంపతులకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు.

చంద్రబాబూ... జగన్ హత్యకు కుట్రలు వద్దు

- వైసీపీ నాయకుడు పోసాని కృష్ణమురళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : చంద్రబాబూ... దయచేసి సీఎం జగన్ హత్యకు కుట్రలు పన్నవద్దని వైసీపీ నాయకుడు పోసాని కృష్ణమురళి కోరారు. బాబుకు మనిషిని చంపడమంటే గడ్డిపూచతో సమానమని ఎద్దేవా చేశారు. ఒక మంచి ముఖ్యమంత్రికి మద్దతుగా మాట్లాడితే ఎవరినైనా చంపేస్తారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం పోసాని విలేకరుల సమావేశం నిర్వహించారు. నాడు మీ అమ్మను తిడితే లోకేశ్ చొక్కా పట్టుకున్నావా పవన్ కల్యాణ్? అని నిలదీశారు. నీకు నాలుగో పెళ్లాం లేదా? అయిదో పెళ్లాం కూడా వెయిటింగ్ లిస్ట్ కదా అని వ్యాఖ్యానించారు. వలంటీర్ ఆడపడుచులను ట్రాఫికింగ్ చేస్తారన్నప్పుడు తప్పు అనిపించలేదా? అని మండిపడ్డారు. నిన్న పవన్ కల్యాణ్ గారికి చాలా కోసం వచ్చిందని, బాధ వచ్చిందని, పవన్ భార్యలని పెళ్లాలు అని అంటున్నారట, పెళ్లాన్ని పెళ్లాం అనడానికి వీల్లేదట అని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్... పెళ్లాం అని ఎందుకు అనకూడదు? అనొచ్చు అని వివరించారు. ఏపీలో వలంటీర్లలో ఆడపడుచులు వేలాది మంది ఉన్నారని, అందులో అన్ని కులాలు, మతాల వారు ఉన్నారని స్పష్టం చేశారు. వీళ్లు, ఇంటింటికీ వచ్చి పింఛన్లు ఇస్తూ పనిచేస్తుంటే... వాళ్లు వ్యభిచారం, ట్రాఫికింగ్ చేస్తున్నారని ఎందుకు వెధవ పలుకులు పలికావు? అని ధ్వజమెత్తారు. అది వారి వ్యక్తిగతం కాదా?, పెళ్లాం అంటేనే సీఎం స్థాయికి వెళ్లావే, ఇంత మంది ఆడపడచులను ఎందుకు చీప్‌గా మాట్లాడవు అని ప్రశ్నించారు. చంద్రబాబు పదవి లేకుండా ఉండలేరని నాకు తెలుసని, దయచేసి సీఎం జగన్‌ను చంపకండి, ఆయన హత్యకు కుట్రలు పన్నకండని విజ్ఞప్తి చేశారు. రాంగోపాల్‌వర్మను మర్డర్ చేయడానికి ప్లాన్ చేశారని, ఈ విషయం ఇప్పటివరకూ నేను రాంగోపాల్ వర్మకూ చెప్పలేదని పోసాని తెలిపారు.

ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత అవశ్యం

లెనిన్ జయంతి సందర్భంగా వామపక్ష నేతల నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: లక్ష్య సాధనలో వచ్చే అవాంతరాలు, నిర్బంధాలు, సంకెళ్లను తెంచు కొని ముందుకు సాగాలని, వర్గపోరాటం ద్వారానే శ్రామిక విముక్తి సాధ్యమని, దేశంలో... రాష్ట్రంలో సాగుతున్న అరాచక ఫాసిస్టు పాలన అంతం కోసం ప్రగతిశీల, ప్రజాస్వామ్యశక్తులు ఐక్యంగా ముందుకు సాగాలని, అదే మార్క్స్ ఎంగెల్స్, లెనిన్ వంటి మహనీయులకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ప్రప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపకులు, అక్టోబర్ విప్లవ మహానాయకుడు వీఐ లెనిన్ 154వ జయంతి సందర్భంగా విజయవాడలోని లెనిన్ విగ్రహం వద్ద సోమవారం కార్ల్ మార్క్స్ ఎంగెల్స్, లెనిన్ విగ్రహాల కమిటీ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నిబంధనల పేరుతో గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా నిలువెత్తు లెనిన్ భారీ విగ్రహాన్ని తెల్లటి వస్త్రంతో కప్పేశారు. అయినప్పటికీ లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాఘవులు మాట్లాడుతూ పోరాటం లేదా విప్లవం కేవలం కమ్యూనిస్టుల నుండి మాత్రమే వచ్చింది కాదని, ప్రకృతి, సమాజం నుండి విప్లవం వస్తున్నట్లు లెనిన్ చెప్పారని గుర్తు చేశారు. పోరాట క్రమంలో వచ్చే అవాంతరాలు, సంకెళ్లతో వెనకడుగు వేయకూడదన్నారు. అక్కినేని వనజ మాట్లాడుతూ దేశంలో అరాచకాలు పెరిగాయని, మేధావులు, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు, నిర్బంధాలు కొనసాగుతున్నాయన్నారు. మళ్లీ అధికారం కోసం ఆర్ఎస్ఎస్ భావజాల బీజేపీ కుయుక్తులు పన్నుతోందన్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ ఎన్నికల్లో బీజేపీ మద్దతు కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కె.పోలారి మాట్లాడుతూ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ వంటి నేతలు ప్రపంచ విప్లవాలకు మార్గదర్శకులన్నారు. ప్రోగ్రెసివ్ ఫోరమ్ నాయకులు తాజారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ మనోహర్ నాయుడు, ప్రజాశక్తి పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ లక్ష్మయ్య, శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు, కారసాల శ్రీనివాసరావు, ప్రజాసంఘాల నాయకులు పి.జమలయ్య, పరుచూరి రాజేంద్ర, లంక గోవిందరాజులు, పరగటి భాను, సయ్యద్ అఫ్సర్, స్వర్ణ కుమారి, మూలి సాంబశివరావు, మోతుకూరి అరుణ కుమార్, రవిచంద్ర, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. అమరులను స్మరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, నాయకులు నజీర్, జేఎమ్ సుబ్రహ్మణ్యం, ఎస్.రంగారావు గేయాలు ఆలపించారు.

చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు: విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: మొన్ననే 74 సంవత్సరాలు నిండిన చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలని నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి అన్నారు. నగరంలోని మూడో డివిజన్ శ్రీలక్ష్మినగర్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విజయసాయిరెడ్డితో పాటు అసెంబ్లీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ సంక్రాంతి అశ్వనీ, నూడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, ఆనం జయకుమార్ ఓట్లు అభ్యర్థించారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ అభ్యర్థిగా తనను, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఖలీల్‌ను ఆశీర్వదించాలన్నారు. వైసీపీ... లౌకికవాద సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీకి అన్ని కులాలు, మతాలు సమానమేనన్నారు. కూటమిలో ఉన్న బీజేపీ-జనసేన- టీడీపీ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. జగన్‌పై కేసులు పెట్టిన కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టి కూటమికి సహకరిస్తుందని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో జరుగుతోంది క్యాష్ వార్ అన్న చంద్రబాబు మాటలు వింటే భారీ మొత్తాల్లో క్యాష్‌తో దిగిన టీడీపీ అభ్యర్థులు జనాదరణ లేక ఓడిపోవడానికి సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు... అనుభవ రాహిత్యం కలిగిన కుమారుడు లోకేశ్‌ను అందలం ఎక్కించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల శ్రేయస్సుకోసం జగన్ పని చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రజా సేవకులైన వలంటీర్లు హక్కులను కాపాడుతుందన్నారు. 3వ వార్డులో నగదు బదిలీ, నాన్ డీబీటీ సంక్షేమ పథకాల కింద రూ.63 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. మైపాడుకు రూ.తొమ్మిది కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. సింహపురి కాలనీ, మునిసిపల్ స్కూలు సమీపంలోని డ్రెయిన్ల మరమ్మతులు పూర్తిచేసి 100కు పైగా కుటుంబాలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని హామి ఇచ్చారు. పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును టీడీపీ, వైసీపీ మేనిఫెస్టోలో చేర్చాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ ఉక్కును పరిరక్షిస్తామని టీడీపీ, వైసీపీ తమ మేనిఫెస్టోలో చేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై వైసీపీ మోసపూరిత మౌనాన్ని తప్పు పట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మోదీ ప్రభుత్వం అమ్మేస్తుంటే చంద్రబాబు, జగన్ విశాఖ ఎన్నికల ప్రచారంలో ఎందుకు మాట్లాడడం లేదని, మోదీ ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు, భరోసా అంటూ ఊదరగొట్టారనీ, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రస్తావనే చేయలేదన్నారు. ఎన్నో త్యాగాలతో ఏర్పాటు చేసుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని చంద్రబాబుకు లేకపోవడం గర్హనీయమన్నారు. లోకేశ్ పాదయాత్రలో కూడా కనీసం స్టీల్‌ప్లాంట్ కార్మికుల నిరసన దీక్షను సందర్శించకపోగా ఉద్దేశపూర్వకంగా దాటేయడం అవకాశవాదమని ధ్వజమెత్తారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం జగన్, చంద్రబాబు స్పందించకుండా రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బీజేపీ విధానాలకు వంతపాడుతున్నారని మండిపడ్డారు.

ఉద్యోగులందరికీ ఓటు హక్కుకు అవకాశమివ్వండి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఏపీ వీఆర్వోల సంఘం వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులందరికీ తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాకు ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం.అప్పలనాయుడు సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఈ-మెయిల్ ద్వారా లేఖ పంపారు. రాష్ట్రంలో ఉన్న 15 వేల మంది వీఆర్వోలు, ఇతర ఉద్యోగులకు... ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని చెబుతున్నారన్నారు. చాలా జిల్లాల్లో ఆ రకమైన పరిస్థితి కనిపించడం లేదని, చాలామంది వీఆర్వోలు బీఎల్వోలుగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. సొంత గ్రామంలో ఓటు హక్కు వినియోగించుటకు చాలా జిల్లాల్లో పోస్టల్ బ్యాలెట్ తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఆయా నియోజకవర్గ స్థాయిలో రిటర్నింగ్ అధికారి పరిధిలో అందరూ ఓటు హక్కు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అప్పుడే ఉద్యోగులంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశముంటుందని సూచించారు. పోస్టల్ బ్యాలెట్‌లో తప్పులు ఉన్నాయని చాలా జిల్లాల్లో తిరస్కరించడం వల్ల ఓటు హక్కు ఉపయోగం లేకుండా పోతుందని అన్నారు. ఉద్యోగులందరికీ మే ఒకటో తేదీ నుంచి ఐదు వరకు నియోజకవర్గ స్థాయి కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్‌తో సంబంధం లేకుండా ఓటు హక్కు వినియోగించుటకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రస్తుతం పని చేస్తున్న బీఎల్‌వోలకు రెండేళ్ల నుంచి నిలిచిపోయిన గౌరవ వేతనం విడుదల చేయాలని గతంలోనే ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పటివరకు వరకు ఆ నిధులు విడుదల చేయలేదని తెలిపారు. ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లోకి వచ్చే అధికారులకు మౌలిక సదుపాయాలు, భోజన వసతి కల్పించాలని వీఆర్వోలకు, బీఎల్‌వోలకు ఆదేశాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. వాటికి సంబంధించి నిధులపై ఎవరూ మాట్లాడటం లేదని, నిధులు ముందుగానే విడుదల చేయాలని కోరారు.

దేశాభివృద్ధిని విద్యార్థులు పెంచాలి

గజ్జల వెంకటలక్ష్మి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశాభివృద్ధిని పెంచేలా విద్యార్థులు సిద్ధంగా ఉండాలని, ఈ విధమైన సేవలందించే స్వచ్ఛంద సంస్థలకు మహిళా కమిషన్ అండగా ఉంటుందని ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం మహిళా కమిషన్ కార్యాలయంలో మార్పు (మనోరమ అర్జునరావు పబ్లిక్ యుటిలిటీ ట్రస్ట్) స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో మేరిస్టెల్లా కళాశాల విద్యార్థులు చైర్ పర్సన్ గజ్జల లక్ష్మిని కలిశారు. ఈ సందర్భంగా 25 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ కింద సర్టిఫికెట్లను ఆమె అందజేశారు. 25 మంది విద్యార్థులు వివిధ అంశాలపై ఆహారం, పోషణ, సైబర్ సెక్యూరిటీ, యుక్త వయసులో వచ్చే మార్పులు, వ్యక్తిగత ప్రేరణ ఆత్మహత్యను ముందుగా నివారించడం వంటి సమస్యలపై ఆరు నెలలుగా మార్పు సంస్థ ద్వారా శిక్షణ పొందారు. వీరిలో కొంతమంది విద్యార్థులు ఇతర దేశాలకు వెళ్లగా, మరి కొంతమంది దేశ రాజధాని ఢిల్లీలో సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నారు. వారి సేవలను గజ్జల లక్ష్మి కొనియాడారు. అనంతరం మార్పు సంస్థ వ్యవస్థాపకులు రావూరి సూయజ్‌ని చైర్ పర్సన్ వెంకటలక్ష్మి అభినందించారు. సూయజ్ మాట్లాడుతూ విద్యార్థులకు నిస్వార్థ సేవతో మార్పు సంస్థ ద్వారా ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టులను అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సెక్రటరీ వసంత బాల, మహిళ కమిషన్ కార్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకు ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత నామినేషన్

విశాలాంధ్ర-పార్వతీపురం: అరకు పార్లమెంటు అభ్యర్థిగా బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా కొత్తపల్లి గీత సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. కేంద్ర గ్రామీణాభి వృద్ధిశాఖ సహాయ మంత్రి పగ్గన్ సింగ్ కులస్తేతో కలసి పాత బస్టాండ్ నుంచి ర్యాలీగా విచ్చేసి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్‌కు ఆమె నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆ సమయంలో సహాయ రిటర్నింగ్ అధికారైన జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక ఉన్నారు. తొలుత నిర్వహించిన ర్యాలీలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులైన పాంగి రాజారావు, బోనెల విజయ్ చంద్ర, కిల్లు రమేశ్ నాయుడు, మిరియాల శిరీష, గుమ్మడి సంధ్యారాణి, నిమ్మక జయకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ జగదీశ్, మాజీ ఎమ్మెల్యేలు భంజదేవ్, బొబ్బిలి చిరంజీవులు, బీజేపీ నాయకులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, సురగాల ఉమా మహేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదారు మోహనరావు, చందక అనిల్, టీడీపీ పార్వతీపురం పట్టణ అధ్యక్షుడు రవి కుమార్ ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఓటర్లకు జయరామ్ క్షమాపణ చెప్పాలి: యార్లగడ్డ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఓటర్లను వెధవలు అని టీడీపీ ఎన్ఆర్ఐ యూఎస్ కోఆర్డినేటర్ కోమటి జయరామ్ అనడం దారుణమని, ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని తానా ఫౌండేషన్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే రాష్ట్ర ప్రజలకు, ఓటర్లకు జయరామ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటర్లను వెధవలు అనడాన్ని తప్పుబట్టారు. ఓటర్లను కొనుగోలు చేయవచ్చని జయరామ్ వ్యాఖ్యానించడం ఎన్ఆర్ఐలందర్నీ ప్రజల దృష్టిలో చులకన చేయడమే అవుతుందన్నారు. ఒక ఎన్ఆర్ఐగా కోమటి వ్యాఖ్యలను ఖండిస్తున్నానని తెలిపారు. చాలా మంది ఎన్ఆర్ఐ... ప్రజలు, తమ ప్రాంతం కోసం పనిచేస్తున్నారని, ఇలాంటి వ్యాఖ్యలు ఎన్ఆర్ఐ వ్యవస్థను కించపరుస్తాయని అన్నారు. సీఎం జగన్ తరహాలో ప్రజల హృదయాలు గెలుచుకుని ఓట్లడగాలే గాని డబ్బుతో ఓట్లు కొనుగోలు చేయాలని చూడటం సరికాదన్నారు. ఎన్ఆర్ఐలు అంటే కోట్లు, లక్షలు పంచి ఓట్లు కొనేవారిలా అపోహలు పెంచవద్దని, ఎన్ఐఆర్ వ్యవస్థను దెబ్బతీయవద్దని హితవు పలికారు.

సంపాదకీయం

మోదీ దుర్మార్గపు ప్రచారం

సార్వత్రిక ఎన్నికల మొదటి దశగా ఈ నెల 19వ తేదీన జరిగిన పోలింగ్‌లో ఎన్డీయేకు విజయావకాశాలు తక్కువేనని వస్తున్న వార్తలతో నిరాశకు గురైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పుడు అసత్యాలు, విద్వేష ప్రసంగాలను ఆశ్రయించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా విషపూరిత భాషను ఉపయోగిస్తున్నారు. రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో ఆదివారం నిర్వహించిన ర్యాలీలో ప్రధాని మోది పేల్చిన అవాకులు, చవాకులు ఇందుకు తార్కాణం. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మత విభజన సృష్టించేందుకు మోదీ ఇంతకు దిగజారడం అత్యంత విచారకరం. ఈ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న మైనారిటీలైన ముస్లింలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ర్యాలీలో దుర్మార్గమైన దాడి చేశారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్‌మోహన్ సింగ్ 2006లో చేసిన ప్రకటనను తప్పుగా ఉటంకిస్తూ ఆదివారం రాజస్థాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో దేశంలోని అతిపెద్ద మైనారిటీ వర్గమైన ముస్లింలపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన దుర్మార్గపు దాడి అన్ని పరిమితులను దాటిపోయింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఇది తీవ్రంగా ఉల్లంఘించింది. ద్వేషపూరిత ప్రసంగాలపై సుప్రీం కోర్టు ప్రకటనలను తీవ్రంగా ఉల్లంఘించడమే. ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న ఒక వ్యక్తి కీలకమైన సమస్యను అసభ్యంగా మల్చడం ప్రేరేపిత తప్పు అనడంలో ఎటువంటి అనుమానం లేదు. ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్ మేనిఫెస్టోను విమర్శించే హక్కు భారత ప్రధానికి ఉంది. పార్టీ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్ష నాయకులపై ఆయన విరుచుకుపడడాన్ని ఎవరూ పట్టించుకోరు. కానీ ఆదివారం నాడు ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన స్థాయికి ఏమాత్రం తగనివి. ముస్లిం సమాజంలో భయాందోళనలు కలిగించే విధంగా ఉన్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి మీ ఇళ్లకు వచ్చి బంగారం, వెండితోపాటు మీ మంగళసూత్రాల సహా ఆస్తులను లాక్కుని 'చొరబాటుదారుల'కి, ముస్లింలకు పంపిణీ చేస్తుందన్న మోదీ వ్యాఖ్యలు మెజారిటీ వర్గాల్లో భయాన్ని సృష్టించే, మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ఎత్తుగడ. ఇది ఖచ్చితంగా ఏప్రిల్ 19న మొదటి దశ పోలింగ్ తర్వాత ఆయన భయాందోళనకు ప్రతిబింబం. బన్స్‌వారా ర్యాలీలో మోదీ కాంగ్రెస్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే, ప్రజల ఆస్తులు, భూమి, బంగారాన్ని లాక్కుని ముస్లింలకు పంచేస్తుందని వ్యాఖ్యానించారు. మీ కష్టార్జితాన్ని చొరబాటుదారులకు పంచేందుకు మీరు అంగీకరిస్తారా?' అని ప్రశ్నించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని లోక్‌నీతి–సీఎస్‌డీఎస్ సర్వే చెపుతోంది. 'గత ఐదు సంవత్సరాలతో పోలిస్తే నేడు ఉద్యోగం దొరకడం సులభమా లేక కష్టమా' అని ప్రశ్నిస్తే కష్టంగానే ఉన్నదని 62 శాతం మంది కుండబద్దలు కొట్టారు. 'ధరల పెరుగుదల మాటేమిటి? ఐదేళ్లలో పెరిగాయా తగ్గాయా' అని అడిగితే ఏకంగా 71 శాతం మంది పెరిగాయనే చెప్పారు. ముచ్చటగా మూడోసారి అధికారాన్ని దక్కించుకోవాలని ఆశిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ఉద్యోగాలు, ధరల పెరుగుదల, పొదుపు రేట్లు, ప్రజల జీవితాలు వంటి కీలక అంశాలను తన ఎన్నికల ప్రచారంలో తప్పనిసరిగా ప్రస్తావించాల్సి ఉంటుంది. కానీ ఆయన ఈ సమస్యలపై పెదవి విప్పరు. తన పాలనలో దేశం సుభిక్షంగా ఉన్నదని, ప్రగతి పథంలో పయనిస్తోందని చెబుతుంటారు. ప్రతిపక్షాలు అనవసరంగా బురద చల్లుతున్నాయని ఆరోపిస్తారు. ఆయన ప్రసంగాల్లో ప్రతిపక్షాలపై విసుర్లే తప్ప ఎక్కడా ప్రజా సమస్యల ప్రస్తావన ఉండదు. ఆకట్టుకునే ప్రసంగాలతో ఓటర్లను బురిడీ కొట్టించేందుకు ప్రయత్నిస్తుంటారు. ఆ మాటలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేకపోవడం, సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఏమి చేయాలో తోచక ప్రధాని ఈ విధమైన విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నట్టు కనిపిస్తోంది.

మోదీ చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్ష నాయకులు సోమవారం తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్ద దుమారమే రేగింది. దేశ ప్రధాని పదవిలో ఉండి మోదీ మత విద్వేషాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, ఎన్నికల నిబంధలను ఉల్లఘించి ముస్లింలను లక్ష్యంగా చేస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని నెటిజన్ల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల, బీజేపీ అభ్యర్థి మాజీ సినీ నటి హేమమాలినిపై అవాంఛనీయమైన స్త్రీద్వేషపూరిత వ్యాఖ్యల కారణంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రణదీప్ సూర్జేవాలాను 48 గంటల పాటు ప్రచారం చేయకుండా ఈసీ నిషేధించింది. కాంగ్రెస్ నాయకుడిపై ఈసీ అటువంటి చర్యలు తీసుకోవడం సమర్థనీయం. అలాగే ప్రధానమంత్రి కొన్ని రోజుల పాటు ఎన్నికల ప్రచారం చేయకుండా నిరోధించే విషయంలో ఎన్నికల కమిషన్ తక్షణ చర్య తీసుకోవాలన్న డిమాండ్ వెల్లువెత్తుతోంది. అయితే 142 కోట్ల మంది భారత ప్రజలకు సంరక్షకుడిగా ఉండి, అన్ని మత సమూహాలకు చెందిన మొత్తం జనాభా తరపున ఈ దేశాన్ని పరిపాలిస్తున్న ప్రధానమంత్రి చేసిన ఈ దారుణ వ్యాఖ్యలను ఎన్నికల సంఘం పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ వ్యాఖ్యలు ఎంత దారుణమో ఎన్నికల సంఘం మౌనం మరింత దారుణం. మోదీ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలను ఊహించడం కష్టం. మోదీ వ్యాఖ్యలను అసహ్యించుకునే వ్యక్తులు పుష్కలంగా ఉన్నారు. వీరిలో కాంగ్రెస్, "ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు" కూడా ఉన్నారు. కుల, మతాల పేరిట ఓటర్లను విభజించేందుకు ప్రధాని నరేంద్రమోదీ వేసిన ఈ ఎత్తుగడపై భారత ఎన్నికల కమిషన్‌కు చర్య తీసుకోవడానికి కారణం ఉంది కానీ అది జరుగుతుందా? అన్నదే అందరి అనుమానం. మోదీ వ్యాఖ్యలపై ఆందోళన చెందిన పౌరులు సంతకం చేసిన పిటిషన్‌ను ఎన్నికల సంఘానికి పంపేందుకు కొన్ని ప్రతిపక్ష పార్టీలు సిద్ధమౌతున్నాయి. మోదీ వ్యాఖ్యలపై ఎన్నికల సంఘానికి లేఖ రాయాలని తృణమూల్ కాంగ్రెస్ నేత సాకేత్ గోఖలే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'ఎన్నికల సంఘం ప్రతిపక్షాలను పట్టించుకోకుండా మోదీకి, బీజేపీకి ఉచిత పాస్‌లు ఇస్తూనే ఉంది. ఎన్నికల సమయంలో ఈసీ రాజకీయ పార్టీలకు జవాబుదారీగా ఉండదు. కానీ వారు దేశ ప్రజలకు జవాబుదారీగా ఉన్నారు' అని గోఖలే చేసిన వ్యాఖ్యలు అసందర్భమేమి కాదు. విద్వేషపూరిత ప్రసంగాలపై సుప్రీం కోర్టు వ్యాఖ్యలను మోదీ ప్రసంగం తీవ్రంగా ఉల్లంఘించడమే. అందువల్ల సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలపై దృష్టిసారిస్తుందనీ, మోదీకి కోర్టు ధిక్కార నోటీసును జారీ చేసి చర్యలు తీసుకుంటుందని ఆశిద్దాం.

గుర్తుపెట్టుకునే గుర్తు

చింతపట్ల సుదర్శన్

ప్రతిపక్షాలమీద మండిపడుతున్న పాలకపక్షంలా విరుచుకు పడుతున్నాడు ఆకాశంలో గ్యాసుబండ. ఈ ఎర్రటి ఎండలో కుండలాంటి కడుపు మోసుకుంటూ ఇంటికి వెళ్లక పోతేనేం అనుకుని ఓ చెట్టుకింద కూలబడ్డది డాంకీ. కూచున్నాక ముక్కుపుటాలకు ఏదో వాసనఘాటుగా కొట్టింది. పెద్దకళ్లు ఆ వైపుకు త్రిప్పి చూస్తే కనపడింది ప్రభుత్వ మద్యం దుకాణం. అరెరే చూసుకోలేదే! ఇప్పుడు మళ్లీ లేచి కడుపు మోసుకువెళ్లే ఓపిక లేదే! అనుకుని కూచున్నచోటే కళ్లు మూసుకుంది డాంకీ.

నన్ ఆఫ్ యువర్ బిజినెస్ అని ఎవరో అరవటంతో కళ్లు తెరిచిన డాంకీకి గాలికి ఊగుతున్న బట్టలారేసే దండెంలా ఊగుతూ కనిపించాడొకడు. ఆ పక్కనే మైకు పట్టుకుని నిలబడుతున్నాడు మరొకరు ఊగకుండా. నేను ఎంత తాగుతానో, ఏది తాగుతానో నీ కనవసరం. అన్నాడా ఊగు మనిసి. మందు కల్తీ వల్ల జనం చచ్చిపోతున్నారన్నమాట నిజమేనా అన్నాడు అడిగేవాడు. మందు తాగకపోయినా జనం చచ్చి పోతారు. మందంటే కల్తీ మరి అన్నాడు మరొకడు. ఏం మందు నూట ముప్పయి కాస్తా రెండొందలైంది. ఇంటికి చేరేలోపునే విరిగి పోతుంది. మళ్లీ మళ్లీ పోవడం, రావడం దేనికని. ఇక్కడే ఉంటున్నా అన్నాడొక వీర మందుబాబు. ఈవేళున్న బ్రాండు రేపుండదు. అసలు పేర్లే తెలీని బ్రాండులున్నవి. తాగినా చస్తాం తాగకపోయినా చస్తాం కనుక తాగి చస్తేనే బెష్టు కదా అన్నాడింకొకడు. ఆయనగారి హయాంలో మందు నిప్పులా ఉండేది. ఇప్పుడు ధరా ఎక్కువే కల్తీ ఎక్కువే అన్న వాడివి మద్య నిషేధం అమలు చేస్తే బాగుండేదికదా అనడిగాడు మైకు ఎత్తి పట్టుకున్నవాడు. మందు బందయితే మేము మానేస్తాము కానీ, గవర్నమెంటు చచ్చి పోద్ది మరి అన్నాడో డోసుబాబు దభీలున గాడిద పక్కన కూలబడుతూ. డాంకీ ఉలిక్కిపడింది. పేరూ ఊరూ తెలీని మందు ముక్కులో జొరబడి ఉక్కిరి బిక్కిరి చేసింది. ధరెంతయినా సరే మంచి మందు ఇచ్చేవాడికే మా అమూల్యమైన ఓటు అని అరుస్తూ పరుగెత్తా డొకడు. ఈ ప్రభుత్వాన్ని, ఈ మద్యాన్నీ మనుషులు భరించాలి కాని మనకేవిటవసరం. నన్ ఆఫ్ మై బిజినెస్ అనుకుంటూ లేచి నిలబడింది. డాంకీ. గాడిద పక్కన నిలబడ్డవాడు 'స్టడీ' గా నిలబడే ప్రయత్నం చేస్తూ. ఈ సారి గాడిద గుర్తుకే నా ఓటు అనరిచాడు. క్షణం ఆగలేదు డాంకీ. అరుగుమీదకి ఎక్కుతూ చూసింది డాగీని. గోడకు అనుకుని కళ్లు మూసుకుని ఉంది. 'సన్ స్ట్రోక్'లో స్పృహ కోల్పోలేదు కదా అనుకుంటూ 'బ్రో' ఉన్నావా? అనడిగింది. ఉన్నానంటే ఉన్నాను అంటూ మూలిగింది డాగీ. ఏమైంది బ్రో 'డల్'గా ఉన్నావు అంది డాంకీ. జయంతులంటూ, వర్థంతులంటూ మందు షాపులు బందు చేసుకుంటే నాదేం పోయింది అనుకున్నా, కానీ మాంసం దుకాణాలు కూడా బందు చేస్తే పస్తే కద నాలాంటి స్ట్రీట్ డాగ్స్‌కు అంది డాగీ నీరసంగా.

మందు మాట మరి ఎత్తకు. ఆ వాసన తలుచుకుంటే వామిటింగ్ సెన్సేషన్ వస్తుంది. కల్తీ అంటాడొకడు. ధరలు రెట్టింపంటాడొకడు. తాగకపోతే చస్తానంటాడొకడు. తాగే చస్తానంటాడొకడు. వీళ్లంతా మందుకే ఓటేస్తారో ఏమో అంది డాంకీ. ఆ ఎన్నికలనాటి మందే అంతా 'డిసైడ్' చేస్తుందేమో కానీ నీకు మాత్రం ఫుడ్డుకు కరువనేదేలేదు కదా! అంది డాగీ. అదేమిటి నా పొట్టమీద పడ్డావు అంది డాంకీ తన 'బెల్లీ' వైపు చూసు కుంటూ. నీ పొట్టలో అనేకం కనపడుతున్నాయి నాకు మరి అంది డాగీ. ఏమిటో అవి ఇంత మందంగా తోలు కప్పుకుని ఉన్న నా 'లంచ్‌బాక్స్' కనపడుతున్నదా నీకు. క్లియర్‌గా కనిపిస్తున్నది లోపల ఫ్యాన్లూ, గ్లాసులూ బోలెడున్నాయి. ఒకటో రెండో ఫుల్లూ, అరచేతులూ లేకపోలేదు అన్నట్లు ఆ చక్రం ఏమిటి సైకిలు చక్రంలా ఉందే! ఫుల్లుగా ఫుడ్డు కొట్టేసినట్టున్నావు అంది డాగీ. అప్పుడు వెలిగింది బల్బు గాడిద మెడమీద ఉన్న తలలో. అర్థమైంది నువ్వన్నది ఎలక్షన్ కరపత్రాలు వాటిల్లో ఉన్న గుర్తుల గురించే కదా కరపత్రాలే కాదు. అభ్యర్థుల ఫొటోలు కూడా కనబడుతున్నవి అంది డాగీ. కరపత్రాలూ వాటి మీద గుర్తులు, పోస్టర్లు, చిత్రపటాలు నమిలినవే నమిలి బోరుకొడ్తున్నదనుకో. అయినా ఫ్యాన్ సౌండ్ బాగా వస్తుంది కానీ గాలే వీయడం లేదని, గ్లాసు నేలమీద పడితే భళ్లు మంటుందని, సైకిలు చక్రంలో గాలేదీ అనీ రకరకాల గుర్తుల మీదా అనేక రకాల జోకులు 'కట్' చేసుకుంటున్నారు కదా! అంతే కాదు కాబోయే ఎంపీలు, ఎంఎల్ఏలు తమకు ఓటు వెయ్యమని అడగకుండా అవతలి వాడికి ఓటువేస్తే 'డ్రైనేజీ కాలువలో వేసి నట్టేనని హెచ్చరిస్తున్నాడు. పసుపతి అని, చంద్రముఖి అని, దత్తపుత్రుడని, సైకో అనీ ఒకళ్ల నొకళ్లు ముద్దుపేర్లతో పిల్చుకుంటున్నారు అని డాగీ అంటుంటే అయిదయినా ఎండలో చురుకు తగ్గలేదు అంటూ అరుగుఎక్కాడు అబ్బాయి.

ఎండల్లో ఎన్నికలు పెట్టారు. కాలే పొయ్యీ, మండె పెనమూ మరి. కాయ్‌రాజా కాయ్ అని ఎండకాస్తున్నది అన్నది డాగీ. అబ్బాయి వచ్చావా నాకు ఓ డవుట్ వస్తున్నది అడగనా అంది డాంకీ. వద్దన్నా అడగకుండా ఉండవుకదా కనుక అడుగుమరి అన్నాడబ్బాయి. ఇందాక తెలీక మందు అదే ప్రభుత్వ మందు దుకాణం దగ్గర కూలబడ్డప్పుడు ఓ మందు మానవుడు గాడిద గుర్తుకే నా ఓటు అని అరిచాడు. నా గుర్తు పెట్టుకుని ఎంపీలు, ఎంఎల్ఏలు అయితే అది నాకు గర్వకారణమే కదా! నా గుర్తు ఏ పార్టీకి ఉన్నదో చెప్పు బ్రో అంది డాంకీ చెవులు ఎగరేస్తూ. రోజు రోజుకీ పార్టీలు పెరిగిపోతున్నవి. చెంబులూ, డేకిశాలు, పళ్లాలు అన్నీ అయిపోయేక ఏమో గాడిద ఎగరావచ్చు ఎవరు చెప్పగలరు. ఫ్యూచర్‌లో నీ గుర్తుతో గెలిచి సీఎంలు అవుతారేమో అన్నాడు అబ్బాయి. 'చెప్పు' గుర్తుగా గలవాడొ కడు ప్రచారం కోసం చెప్పుల దండ వేసుకు ఊరేగు తున్నాడంట. ఇక నిన్ను గుర్తుగా పెట్టుకున్నవాడ్ని నువ్వు వీపు మీద ఎక్కించుకుని ఊరేగించా ల్సివస్తుంది మరి అంది డాగీ. ఇప్పటి కిప్పుడు గాడిద గుర్తుగా లేకపోయినా ఎన్నికల్లో నిలబడ్డవాళ్లల్లో నీ 'అంశ' లేకపోలేదులే అంది డాగీ. గుర్తుల దేమున్నదిలే! ఎప్పటికీ గుర్తుపెట్టు కునేలా పాలించే వారిని ఎన్నుకునే విచక్షణ ఓటర్లలో ఉండాలి అంది డాంకీ.

జనం కోసం - జనం మధ్యకు - జన ప్రణాళిక

చలసాని వెంకటరామారావు

2024 మే 13న మన రాష్ట్ర శాసన సభకు ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఒకవైపున, ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఇంకోవైపున మోహరించి సంకుల సమరానికి సిద్ధమవుతున్నారు. డబ్బు, మద్యం, వాగ్దానాలతో చుట్టివస్తున్నారు. ఈ దశలో ఐదు ఏళ్ళుగా అప్రజాస్వామికంగా, అవినీతి, పక్షపాతంతో, అభివృద్ధిని మరచి పాలించిన వైఎస్సార్ కాంగ్రెస్, ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడకుండా తీరా ఎన్నికలు వచ్చేసరికి రాష్ట్రానికి గత 10 ఏళ్ళుగా తీరని ద్రోహం చేసిన బీజేపీతో అపవిత్ర కూటమి కట్టిన చంద్రబాబు, తెలుగు దేశం పార్టీలకు ప్రత్యామ్నాయంగా లౌకిక, ప్రజాస్వామ్య వేదికగా ఆవిర్భవించిన ఇండియా కూటమి తరపున రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీలు ఉమ్మడి అవగాహనతో సీట్లు సర్దుబాటు చేసుకుని పోటీ చేస్తున్నాయి.

కేంద్రంలో గత 10 సంవత్సరాలుగా కరడుగట్టిన మత ఉన్మాదుల పాలనలో దేశ ఆర్థిక ప్రగతి కుంటుపడింది. రాజ్యాంగ వ్యవస్థలు నాశనమై పోయాయి. ప్రజల సంపద ప్రైవేటు పెట్టుబడుదారులకు, తమ ఆశ్రిత వర్గాలకు అప్పనంగా అప్పగిస్తున్నారు. ఉపాధి అవకాశాలు దెబ్బతిని నిరుద్యోగం తీవ్ర స్థాయికి చేరింది. మహిళలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీలు, దళిత బహుజనులు తీవ్రదాడులకు గురవుతున్నారు. సమాఖ్య పాలనకు తిలోదకాలు ఇచ్చి నియంతృత్వ, నిరంకుశ, అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నారు. 'వికసిత భారత్', 'సమ్మిళిత అభివృద్ధి' పేర్లతో ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారు. హిట్లర్ ఆదర్శంగా దేశంలో ప్రతిపక్షం లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తూ ప్రతిపక్ష నాయకులను అక్రమ కేసులలో ఇరికించి జైళ్ళకు పంపుతున్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసంచేసి నియంతృత్వ, అధ్యక్ష తరహా రాజ్యవ్యవస్థను తీసుకు రావాలనే కుట్రలో భాగంగా మూడు వంతుల సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మార్చివేయాలని కలలు కంటున్నారు. అటువంటి కేంద్ర పాలకులకు మన రాష్ట్రంలోని అధికార – ప్రతిపక్ష పార్టీలు వందిమాగదులుగా వంత పాడుతూ భజన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి "జనం కోసం – జనం మధ్యకు – జన ప్రణాళిక" పేరుతో తన ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. ఇండియా కూటమి పార్టీలకు అధికారం అప్పగిస్తే ఎన్నికల హామీలను చిత్తశుద్ధితో అమలు పరుస్తామని సీపీఐ వాగ్దానం చేసింది. కేంద్రంలో, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా తమ ప్రణాళికలోని అంశాల సాధనకు నిరంతరం ప్రజల సహకారంతో విస్తృత పోరాటాలు నిర్వ హిస్తామని వాగ్దానం చేసింది. అందువల్ల రానున్న లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలో ఇండియా కూటమి పార్టీలైన కాంగ్రెస్– సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీలు ఉమ్మడి అవగాహనలో భాగంగా ఒక లోక్‌సభ స్థానంలో, 8 శాసన సభ స్థానాలలో సీపీఐ పోటీ చేస్తున్నది. మిగిలిన స్థానాలలో కాంగ్రెస్, సీపీఐ (ఎం) పార్టీలకు మద్దతు ఇస్తున్నది. రాష్ట్రంలోని ఓటర్లు విశాల దృష్టితో దేశ, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆలోచించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ తన ఎన్నికల ప్రణాళిక ద్వారా విజ్ఞప్తి చేసింది.

2014 రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు, రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుక బడిన

ప్రాంతాలకు ఇస్తామన్న బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ సాధనకు, రాష్ట్రంలో నిర్మిస్తామన్న జాతీయ స్థాయి విద్యాసంస్థల నిర్మాణం కోసం సీపీఐ పోరాడుతుంది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కేంద్రం పూర్తి పరిహారం అందించాలని, ప్రాజెక్టు పనులను సాచివేత లేకుండా పూర్తి చేయాలని, కుడి కాలవలోని చింతల పూడి ఎత్తి పోతల పథకం పనుల ప్రారంభానికి సీపీఐ కట్టుబడి ఉంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉన్న అమరావతిని రాష్ట్ర రాజధానిగా కొనసాగిస్తూ, రాష్ట్ర హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేయాలని, విశాఖ, విజయవాడలలో హైకోర్టు బెంచ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతుంది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో పోరాడి సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తూ, దానికి అవసరమైన సొంత గనులు ఏర్పాటు చేయాలని, గంగవరం పోర్టులో విశాఖ ఉక్కు నౌకలకు ప్రథమ ప్రాధాన్యత కల్పించాలని సీపీఐ భావి స్తున్నది. స్వామి నాథన్ కమిషన్ సిఫారసుల మేరకు అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని, కేరళ తరహా ఋణ విమోచన చట్టం, సమగ్ర ఉచిత పంటల బీమా పథకం కొరకు ఉద్యమం సాగిస్తుంది. పెరుగుతున్న సాగు ఖర్చులకు అనుగుణంగా ప్రతి రైతుకు ఎకరానికి రూ.15,000/- లు పెట్టుబడి సాయం అందించాలి. రైతులకు పంట రుణం రు.2 లక్షల వరకు వడ్డీ లేకుండా, పావలా వడ్డీకి రూ.3 లక్షల వరకు రుణపరపతి కల్పించాలి. వ్యవసాయ మార్కెట్ల పరిధిలోనే గోడౌన్లలో నిల్వ ఉంచిన పంటలకు రైతు బంధు పథకం ద్వారా 50 శాతం వడ్డీలేని రుణాలకు సీపీఐ కట్టుబడి ఉంది. సహకార వ్యవస్థను ప్రోత్సహించి బలోపేతం చేయటంతోపాటు అనుబంధ రంగాల వృద్ధికి, గ్రామీణ పరిశ్రమల స్థాపనకు, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించటానికి ప్రాధాన్యత ఇవ్వాలి. సహకార రంగంలో మూత బడిన పరిశ్రమలను తెరిపించాలి. పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, సేకరించిన ప్రతి లీటరు పాలకు ఐదు రూపాయలు బోనస్ ఇవ్వటం జరుగుతుంది. పశువులు, గొర్రెలు, మేకలు వంటి వాటికి ఉచిత బీమా ఇస్తూ, పౌల్ట్రీ పరిశ్రమకు అత్యధిక ప్రోత్సాహం ఇవ్వటం జరుగుతుంది. ఆంధ్ర ప్రదేశ్ భూయాజమాన్య హక్కుల చట్టం రద్దుకు సీపీఐ మద్దతు ఇస్తుంది. అన్ని నియోజక వర్గాలలో రెసిడెన్షియల్ పాఠశాలలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన పాలిటెక్నిక్ కాలేజీల నిర్మాణానికి హామీ ఇస్తుంది. 90శాతం సబ్సిడీపై మైక్రో ఇరిగేషన్ పథకాలను అందించాలని డిమాండ్ చేస్తుంది.

భారత కార్మిక వర్గం పోరాటాల ద్వారా అశేష త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి యాజమాన్యాలకు కార్మికులను బానిసలుగా మార్చటం జరిగింది. తిరిగి కార్మిక చట్టాల పునరుద్ధరణ, కనీస వేతనం రు.26 వేలుకు, ప్రతి కార్మికునికి ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్., గ్రాట్యుటీ, బోనస్‌తోపాటు ఐదేళ్ళు పనిచేస్తే పర్మినెంట్ కార్మికునిగా గుర్తింపునకు సీపీఐ కట్టుబడుతుంది. మున్సిపల్ రంగంలో కాంట్రాక్టు కార్మికుల స్థానంలో పర్మినెంట్ కృషితోపాటు అన్ని రంగాలలో కాంట్రాక్టు పని విధానం రద్దు అవుతుంది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే ప్రయోజనాలు అన్నింటిని పునరుద్ధరించటం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను పాత పెన్షన్ విధానం పునరుద్ధరించటంతో పాటు 12వ పిఆర్‌సి అమలు చేస్తారు. 50 సంవత్సరాలు నిండిన పేద రైతులకు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తారు. అటవీ హక్కుల చట్టం పరిధిలో భూమి పంపిణీకి ఏర్పాటు, దీనితో పాటు ఎసైన్‌మెంటు కమిటీల పునరుద్ధరణ, పేదల సాగులోని భూములకు రక్షణ చట్టం తీసుకురావటం జరుగుతుంది. కోనేరు రంగారావు కమిటీ సిఫారసుల మేరకు భూమి పంపిణీకి ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద 200 రోజుల పని గ్యారంటీతో పాట రోజు కూలి రూ.600 ఇవ్వబడుతుంది. ఇల్లు లేని పేదలకు మూడు సెంట్లు స్థలంతో పాటు డబల్ బెడ్ రూం ఇల్లు నిర్మిస్తారు. కేజీ టు పీజీ ఉచిత విద్య, వంటగ్యాస్ సిలిండర్ 500 రూపాయలకే సరఫరా జరుగుతుంది. అగ్రిగోల్డ్ బాధితులకు ఇవ్వవలసిన మొత్తం ఇప్పించటం జరుగుతుంది.

రాష్ట్రంలో ఉన్న అనేక ప్రజా సమస్యలను సీపీఐ తన రాష్ట్ర ఎన్నికల ప్రణాళికలలో చర్చించటంతోపాటు భారత రాజ్యాంగానికి, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలగకుండా దేశపాలన సాగాలని కోరుతున్నది. ప్రస్తుతం దేశంలో సాగుతున్న ఏకపక్ష నిర్ణయ పాలనకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటాన్ని కొనసాగిస్తుంది. పరమత సహనాన్ని పాటిస్తూ, పాలనలో మత శక్తుల జోక్యాన్ని నివారిస్తుంది. పదవీ వ్యామోహంతో కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి అగ్ని జ్వాలలు రగిల్చే స్వార్థపర, విచ్ఛిన్న శక్తులకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం నిర్వహిస్తుంది. ప్రజల మధ్య అసమానతలు సృష్టించేందుకు సాధనంగా రూపొందించిన పౌరసత్వ సవరణ బిల్లును ఉపసంహరించటమే కాకుండా ఎన్.ఆర్.సి., ఎన్.పి.ఏ. ల రద్దు కొరకు సీపీఐ పోరాడుతుంది. నూరేళ్ళ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఎన్నో త్యాగాలు చేసిన భారత కమ్యూనిస్టు పార్టీ భవిష్యత్ ప్రజా జీవితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అంధకార బంధురం కాకుండా నిరంతరం ప్రజలను అంటి పెట్టుకుని ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహిస్తుంది. అందుకు సీపీఐ రాష్ట్ర సమితి వెలువరించిన ఎన్నికల ప్రణాళిక వెలుగులో "జనం కోసం – జనం మధ్యకు – జన ప్రణాళిక" ద్వారా వేలాది మంది కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు అండగా రానున్న సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్రంలో సమరశీల పోరాటం నిర్వహించాలి.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు
సెల్: 9490952093.

మత రాజ్యం ప్రమాదం

వినయ్ విశ్వం

ప్రజాస్వామ్యానికి ప్రజలే పునాది. ప్రజలను వెనక్కినెట్టి, డబ్బుతో ప్రజలను ఆకట్టుకోనే పరిస్థితి బలపడుతోంది. పెట్టుబడి దారీ వ్యవస్థ, లౌకికతత్వం, పౌర హక్కులు, సంక్షేమ రాజ్యానికంటే ప్రజాస్వామ్యం అప్రధానమైతే సోషలిజం కలలు అంతరించినట్లే. 18వ లోక్‌సభ ఎన్నికల నిర్వహణ సందర్భంగా మనం పైన పేర్కొన్న ప్రమాదం ఎదుర్కొంటున్నాం. ఇండియా సెక్యులర్ దేశంగా మనుగడ సాగిస్తుందా అన్న సవాలు నేడు ఎదురవు తోంది. ఇండియాను మతరాజ్యంగా మార్చేందుకు సంఘ్‌పరివార్ శక్తులు గత పదిసంవత్సరాలుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నాయి. అయోధ్యలో రామాలయం నిర్మాణం నుంచి పౌరసత్వ సవరణ చట్టం వరకు మోదీ నిర్వహిస్తున్న కార్యకలాపాలన్నీ మత రాజ్యాంగ ఏర్పాటుకు పునాదులు. ఇండియా సంస్కృతికి, వారసత్వానికి వ్యతిరేకమైన జాతీయ భావజాలాన్ని దేశప్రజలపై రుద్దేందుకు ఈ శక్తులు ప్రయత్నిస్తున్నాయి. హిందూ పేరుతో ప్రచారం చేస్తున్న భావాలు హిందూ మతానికి ఏమాత్రం సంబంధం లేదు. ఆర్ఎస్ఎస్ తాత్వికత హిందుమతానికి సమానం కానేకాదు, అది భారతదేశానికి పూర్తి వ్యతిరేకమైనది. వాస్తవానికి వీరు ఇండియాలో ప్రచారం చేసే భావజాలం హిట్లర్ అనుసరించిన ఫాసిజం. ఫాసిజం పునాదులు జాత్యహంకార భావజాలం, పెట్టుబడిదారీ వ్యవస్థకు పూర్తి సహకారంగా ఉండేది. ఇటలీలో ముస్సోలిని, జర్మనీలో హిట్లర్ ఇలాంటి పంథాలనే అనుసరించారు.

అర్ఎస్ఎస్ వారు అనుసరించిన తాత్వికత పునాదిగా అదే మార్గాన్ని అనుసరిస్తోంది. విదేశీ భావజాలాలను ఆర్ఎస్ఎస్– బీజేపీలు ఆచరిస్తూ రెండు విడివిడి సంస్థలుగా చెప్పు కుంటాయి. ఈ రెండు ఒకే విధమైన వ్యూహాలను ప్రచారం చేస్తాయి. వీటిని సీరియస్‌గా అధ్యయనం చేయాల్సిందే. హిట్లర్ స్వీయచరిత్ర (మెయిన్ కౌంఫ్) ఎంఎస్ గోల్వాల్కర్ భావజాలం దాదాపు ఒకే విధంగా కనిపిస్తాయి. ఆర్ఎస్ఎస్ వీటిని వేదంగా తీసుకోవడమేగాక జాతీయతకు సూచికగా తీసుకుంటుంది. ఆర్ఎస్ఎస్, బీజేపీలు సాంస్కృతిక జాతీయతగా ప్రచారం చేస్తున్నాయి. అయితే భారతజాతి వైవిధ్యం, నిజమైన సంస్కృతికి ఈ శక్తులు ప్రచారంచేసే దానికి ఏ మాత్రం సంబంధంలేదు. ఈ శక్తుల పాలనతో ఇండియా ఆత్మ అంతమవుతుంది.

ప్రజాస్వామ్యం, లౌకికతత్వం భారతదేశ ఆత్మ. వీటిని పునరుజ్జీవింప చేసి, పటిష్టపరిచేందుకు ఈ ఎన్నికల ద్వారా పోరాడాలి. బ్యాలెట్ పోరాటం ద్వారా వీటిని సాకారం చేసుకోవాలి. కేరళలో ఎల్‌డిఎఫ్–యుడిఎఫ్‌ల మధ్య పోరాటం జరుగుతోంది. యుడిఎఫ్ గుడ్డిగా వామపక్ష వ్యతిరేకతను అనుసరిస్తుంది. అంతేకాదు, బీజేపీ బుజాల మీద నుంచి ఎల్‌డిఎఫ్‌పైన యుడిఎఫ్ పోరాడుతున్నది. మరోవైపు ఎస్‌డిపీఐ పార్టీ అండదండలతో పోరాడుతోంది. ఎల్‌డిఎఫ్ లేవనెత్తే ప్రశ్నలు వేటికీ యుడిఎఫ్ సమాధానం చెప్పలేదు. దిగజారుడుతనాన్ని కప్పిపుచ్చుకునేందుకు, వారు పెద్ద ప్రశ్నార్థకంగా ఉంటున్నారు. ఎవరికోసం వామపక్షం పార్లమెంట్‌కు వెళుతుంది? వామపక్షం జవాబు ధృఢంగా సులభంగా ఉంటుంది. ఇండియా కూటమి తరఫునే పార్లమెంటులో ఎల్‌డిఎఫ్ చర్చల్లో పాల్గొంటుంది. ఏ మాత్రం రాజీ పడకుండా, దృఢనిశ్చయంగా ఎల్‌డిఎఫ్ పనిచేస్తుంది. ప్రజలకు రాజకీయ గ్యారెంటీని ఎల్‌డిఎఫ్ ఇస్తుంది. కాంగ్రెస్ నేడు భావజాలం రాజకీయ సంక్షోభంలో అభద్రతతో పనిచేస్తోంది. ఒక వేళ హంగ్ పార్లమెంట్ ఏర్పడవచ్చు. ఎన్‌డీఏకి నాయకత్వం వహించే బీజేపీ అతిపెద్ద పార్టీగా ఏర్పడితే అదానీలు, ఈడీ, ఐటి దర్యాప్తు సంస్థలు రాత్రికిరాత్రి ఎంపీలను పట్టుకుని తీసుకువచ్చి బీజేపీ శిబిరంలో చేర్చగలవు. వీరి ఒత్తిళ్లకు లొంగకుండా దృఢంగా నిలిచే కాంగ్రెస్ ఎంపీలు ఎంత మంది ఉన్నారు? కేరళలోని కాంగ్రెస్ ఎంపీలు బీజేపీకి భయపడకుండా నిలుస్తారా. వీరికి, బీజేపీకి మధ్యదూరం రోజురోజుకు దగ్గరై పోతోంది. గాంధీ–నెహ్రూలకు విలువనివ్వకుండా మాట్లాడుతున్నా కాంగ్రెస్ రాజకీయ సంక్షోభం ఎదుర్కొంటున్నది. ఈ దశలో వామపక్ష వ్యతిరేకతతో కొట్టుమిట్టాడుతోంది. వామపక్షమే భారతదేశ రాజకీయా లలో తగినశక్తి. 1957 నుంచి కేరళ భవితవ్య మార్గాన్ని చూపింది. తృతీయపక్షం గురించి డంబాలు పలుకుతున్న ఫాసిస్టులను ఓడించి, ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ఎల్‌డిఎఫ్ కృషిచేస్తుంది. మనమంతా ఐక్యంగా పోరాడవలసిన సమయం ఆసన్నమైంది.

సీపీఐ జాతీయకార్యదర్శి

విద్వేష రాజకీయాలు వదలండి

మోదీకి ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ సూచన

పాట్నా/న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా దేశంలో ముస్లిం సమాజాన్ని ఉద్దేశించి రాజస్థాన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వివాదాస్పద ఎన్నికల ప్రసంగం ప్రకంపనలు రేపుతోంది. దీనిపై ఇండియా కూటమి నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. మోదీ వ్యాఖ్యలపై ఆర్జేడీ నేత, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్ ఒకింత భావోద్వేగంతో మాట్లాడారు. 'ప్రధానమంత్రికి నేను ముకుళిత హస్తాలతో చెబుతున్నాను... దయచేసి అసలు సమస్యలపై మాట్లాడండి, ఈ విద్వేష రాజకీయాలను పక్కన పెట్టండి. దేశ యువత, వృద్ధులు, రైతులు, వ్యాపారులు, తల్లులు సోదరీమణులు ఇలా ప్రజలందరికీ ఒకే రకమైన సమస్యలు ఉన్నాయి. వాటిపై దృష్టిపెట్టండి' అని మీడియా ముఖంగా విజ్ఞప్తి చేశారు. 'పేదరికాన్ని అధిగమించడానికి, పెరుగుతున్న జీవన వ్యయాలను ఎదుర్కోవటానికి ప్రతి ఒక్కరూ ఉద్యోగాలు అన్వేషిస్తున్నారు కాబట్టి ఈ వాస్తవ సమస్యలపై చర్చించండి. గత 10 సంవత్సరాలలో మీరు దేశానికి, బీహార్‌కు ఏం చేశారో మాకు చెప్పాలని నేను మళ్లీ ప్రధానమంత్రిని కోరుతున్నాను' యాదవ్ పాట్నాలో విలేకరులతో అన్నారు. బీహార్, దేశం అభివృద్ధికి ఏం చేస్తారో మాట్లాడకుండా ప్రధాని కేవలం దేవాలయాల గురించి, ముస్లింల గురించి మాట్లాడుతున్నారు. ఇది మంచిది కాదని ఆయన పేర్కొన్నారు. ఆదివారం రాజస్థాన్‌లోని బన్స్వారాలో మోదీ చేసిన ప్రసంగాన్ని, ప్రతిపక్షాలతో పాటు ప్రజాసంఘాలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాయి. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మోదీ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. ఎఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ మోదీ ఇచ్చే గ్యారంటీ 'ముస్లింలను దుర్భాషలాడటమే' అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ... ప్రధాని ఓట్ల కోసం 'అబద్ధాలు' మాట్లాడుతున్నారన్నారు.

రాజస్థాన్‌లో ప్రధాని మోదీ ఏం అన్నారంటే?

'ఈ దేశంలో వనరులపై తొలి హక్కు ముస్లింలదే అని ఇంతకుముందు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. అంటే ఈ సందపనంతా కాంగ్రెస్ పార్టీ ఎవరికి పంచుతామని అంటోంది. ఎవరికి ఎక్కువ పిల్లలు ఉంటారో వాళ్లకి పంచుతామంటోంది. మీరు కష్టపడి సంపాదించుకున్న సంపదను చొరబాటుదారులకు ఇవ్వడం మీకు సమ్మతమేనా? కానీ ఈ అంశాన్ని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చెప్పింది. ఈ అర్బన్ నక్సల్స్ ఆలోచన ఎలా ఉందంటే వాళ్లు మాతృమూర్తులు, సోదరీమణుల మంగళసూత్రాలను కూడా వదలరు. వారు ఆ స్థాయికి వెళ్లగలరు.' అని మోదీ అన్నారు.

2006లో మన్మోహన్ సింగ్ ఏం చెప్పారు?

'దేశంలో అల్పసంఖ్యాక వర్గాలు... ముఖ్యంగా ముస్లింలకు అభివృద్ధి ఫలాలు సమానంగా అందేలా వారికి సాధికారత కల్పిస్తూ మేం వినూత్న ప్రణాళికలను తీసుకురాబోతున్నాం. దేశంలోని వనరులపై వారికే తొలి హక్కు ఉండాలి' అన్నారు.

ప్రధానిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి: కపిల్ సిబల్



మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది కపిల్ స్పందిస్తూ... భారతదేశ చరిత్రలో ఎన్నడూ రాజకీయ చర్చ ఇంత అథోగతిలో పడలేదన్నారు. ప్రధాని మోదీపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. 'ప్రధాన మంత్రి ప్రసంగం తర్వాత కోట్లాది మంది ప్రజలు మనోభావాలు దెబ్బతిన్నాయి. బహుశా 1950 తర్వాత ఇంతటి ప్రకటన మరే ప్రధానమంత్రి ఇవ్వలేదు. ఏళ్ల తరబడి భారత్‌లో నివసిస్తున్న మన మైనార్టీలు చొరబాటుదారులని మోదీ చెబుతున్నారు. ఇది ఎలాంటి రాజకీయం? ఎలాంటి సంస్కృతి' అని సిబల్ అన్నారు. 'మీరు రామమందిరం గురించి మాట్లాడతారు, ఆలయాన్ని ప్రారంభిస్తారు, రాముడి ఆదర్శాల గురించి మాట్లాడతారు. మరోవైపు మీరు ద్వేషాన్ని వ్యాప్తి చేస్తారు. 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్' ఎక్కడ ఉంది. మీరు ద్వేషం అనే గుర్రం మీద భారతదేశాన్ని పాలించలేరు' అని మోదీని ఉద్దేశించి సిబల్ పేర్కొన్నారు. ప్రధాని స్థాయికి ఈ వ్యాఖ్యలు తగవని హితవు పలికారు. ఈ పదవిలో ఉన్న వ్యక్తి ప్రధానమంత్రి గౌరవానికి అర్హుడు కానప్పుడు, దేశంలోని మేధావులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఎందుకు మౌనం వహిస్తున్నారని కూడా సిబల్ ప్రశ్నించారు. దేశ సంపదలో 40 శాతానికి పైగా జనాభా ఒక శాతం మంది చేతిలో ఉన్న తరుణంలో ప్రధాని సంపద గురించి మాట్లాడారని సిబల్ అన్నారు. 'ఈసీ ఈ ప్రకటనను ఖండించాలి. మోదీకి నోటీసులివ్వాలి. ఇది పునరావృతం కాకుండా ఐపీసీ 153-ఎ కింద కేసు నమోదు చేయండి. ఎన్నికల సంఘం రాజ్యాంగంపై ప్రమాణం చేసిన విషయాన్ని మరచిపోకూడదు. అలాంటి ప్రసంగాలు వారికి గానీ, దేశానికి గానీ మేలు చేయవు' అని సిబల్ అన్నారు. దేశ సంపద ఒకే వర్గానికి చెందుతుందన్న ఉద్దేశం కాంగ్రెస్‌కు, ప్రత్యేకించి మన్మోహన్‌సింగ్‌కు ఎప్పుడూ లేదని, ఎస్సీ, ఎస్టీ, అణగారిన, మైనారిటీల అభ్యున్నతి కోసం ఆయన కృషి చేశారని యూపీఏ ప్రభుత్వంలో మంత్రిగా కూడా పనిచేసిన సిబల్ అన్నారు. ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కోరుతున్నానని సిబల్ అన్నారు.

మోదీ వ్యాఖ్యలు దారుణం

- ఈసీ మౌనం సరికాదు... చర్యలు తీసుకోవాలి
- ప్రతిపక్షాల డిమాండ్

న్యూఢిల్లీ: రాజస్తాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష నాయకులు సోమవారం ధ్వజమెత్తారు. కొంతమంది నాయకులు ఈ విషయమై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని కూడా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'ప్రధాన మంత్రి వ్యాఖ్యలు దారుణమైనవని, అయినప్పటికీ ఎన్నికల సంఘం పట్టించుకోక పోవడం శోచనీయం' అని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. 'ఇది దారుణం. ఎన్నికల సంఘం మౌనం మరింత దారుణం. మోదీ ఆవేశపూరిత ప్రసంగం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ద్వేషపూరిత ప్రసంగాలపై సుప్రీం కోర్టు ప్రకటనలను తీవ్రంగా ఉల్లంఘించడమే' అని ఏచూరి అన్నారు. 'ఇది కఠినమైన చర్య, కోర్టు ధిక్కారం' అని తెలిపారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు దృష్టి సారించి చర్యలు తీసుకుంటుందని సీపీఎం నేత ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ దారుణ ప్రసంగాన్ని సుప్రీం కోర్టు స్వయంచాలకంగా పరిగణిస్తుందని, మోదీకి కోర్టు ధిక్కార నోటీసును జారీ చేసి కఠిన శిక్ష విధించాలని ఆశిస్తున్నాను' అని ఆయన పేర్కొన్నారు. ఆందోళన చెందిన పౌరులు సంతకం చేసిన పిటిషన్‌ను ఆ రోజు తర్వాత ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మోదీ వ్యాఖ్యలపై ఎన్నికల సంఘానికి లేఖ రాయాలని తృణమూల్ కాంగ్రెస్ నేత సాకేత్ గోఖలే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో టీఎంసీ రాజ్యసభ ఎంపీ ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు చెందిన ఇమెయిల్ ఐడీని పంచుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిపక్షాల మాట వినదని పేర్కొంటూ ఆయనకు లేఖలు రాయమని ప్రజలను కోరారు. 'ఎన్నికల సంఘం ప్రతిపక్షాలను పట్టించుకోకుండా మోదీకి, బీజేపీకి ఉచిత పాస్‌లు ఇస్తూనే ఉంది. ఎన్నికల సమయంలో ఈసీ రాజకీయ పార్టీలకు జవాబుదారీగా ఉండదు. కానీ వారు భారతదేశ ప్రజలకు జవాబుదారీగా ఉన్నారు' అని గోఖలే తెలిపారు. మోదీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కనీసం వెయ్యి మంది 'బాధ్యతగల భారత పౌరులు' సీఈసీకి ఇ-మెయిల్ పంపాలని ఆయన కోరారు.

మత విభజనకు మోదీ ప్రయత్నం

కాంగ్రెస్ ధ్వజం

కొచ్చి (కేరళ): ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మత విభజన సృష్టించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సోమవారం ఆరోపించింది. ఆదివారం ఒక ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ చేసిన వివాదాస్పద ప్రసంగంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రధాని పదవికి తగని ప్రకటనలు మోదీ చేశారని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో లేని అంశాన్ని ప్రధాని ఉటంకిస్తున్నారని, ఎన్నికల ప్రయోజనాల కోసం దేశంలో మత విభజన సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. మోదీని ఉద్దేశించి వేణుగోపాల్ వ్యంగ్యాస్త్రం సంధిస్తూ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ మేనిఫెస్టో గురించి 'ఆయనకు అవగాహన కల్పించడానికి' ప్రధానితో అపాయింట్‌మెంట్ కోరారని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కాపీని ప్రధాని మోదీకి ఇవ్వాలని ఖర్గే కోరుకుంటున్నారని, దాని గురించి 'ఓటర్లను తప్పుదోవ పట్టించవద్దని' అభ్యర్థించారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో పాటు కాంగ్రెస్ నేతలందరూ మేనిఫెస్టో కాపీలను మోదీకి పంపుతారని వేణుగోపాల్ చెప్పారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రసంగాన్ని కూడా మోదీ వక్రీకరించారన్నారు.

మోదీవి నిజాలను దారిమళ్లించే కొత్త వ్యూహాలు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'విషపూరితమైన భాష' లో మాట్లాడుతున్నారని కాంగ్రెస్ సోమవారం ఆరోపించింది. వాస్తవ సమస్యల నుంచి దృష్టిని మరల్చడానికి ఆయన అనేక కొత్త వ్యూహాలను కలిగి ఉన్నారని, అయితే 'అబద్ధాల వ్యాపారానికి' ముగింపు దగ్గరలోనే ఉందని అన్నారు. ప్రధాని మోదీ చేసిన 'సంపద పున: పంపిణీ' వ్యాఖ్యలపై వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆదివారం రాత్రి ఎదురు దాడి చేసింది. లోక్‌సభ ఎన్నికల మొదటి దశ ఎన్నికల్లో 'నిరాశ' ఎదుర్కొన్న తర్వాత ప్రధాని ఇప్పుడు 'అబద్ధాలు' ను ఆశ్రయించారన్నారు. నిజమైన సమస్యల నుంచి ప్రజలను మళ్లించడానికి 'ద్వేషపూరిత ప్రసంగం చేశారు' అని ఆరోపించింది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం పెరుగుతున్న ధరలు, నిరుద్యోగంపై దృష్టి సారించిన కాంగ్రెస్ తాజా ప్రకటనను పంచుకుంటూ, 'దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. నరేంద్ర మోదీ 'అంతా బాగానే ఉంది' అని అన్నారని పేర్కొన్నారు. 'సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి' ఆయన (మోదీ) అనేక కొత్త పద్ధతులను కలిగి ఉన్నాడు. కానీ అబద్ధాల వ్యాపారానికి ముగింపు దగ్గరపడింది' అని గాంధీ 'ఎక్స్' లో హిందీలో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ప్రధానిపై విమర్శల దాడి చేశారు. 'ప్రధాన మంత్రి చాలా విషయాలపై విషపూరితమైన భాషలో మాట్లాడుతున్నారు. ఆయన ఒక సాధారణ ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వాలి. 1951 నుంచి ప్రతి పదేళ్లకు జనాభా గణనను నిర్వహిస్తారు. ఇది షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జనాభాకు చెందిన వాస్తవ గణాంకాలను వెల్లడిస్తుంది. ఇది 2021లో జరగాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు చేయలేదు. దీనిపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారు' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఇది బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని ఆయన ఆరోపించారు.

నేరుగా హైస్కూల్ తర్వాతే లా ప్రాక్టీస్ చేయండి

కోర్సును మూడేళ్లకు తగ్గించాలన్న పిటిషనర్‌పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: లా కోర్సును మూడేళ్లకు తగ్గించాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు మండిపడింది. అలాంటప్పుడు కోర్సులు ఎందుకు.... నేరుగా హైస్కూల్ తర్వాతే ప్రాక్టీస్ చేయండంటూ పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంటర్మీడియట్ లేదా 12వ తరగతి తర్వాత నేరుగా మూడేళ్ల లా కోర్సు (ఎల్ఎల్‌బీ) చదివేందుకు అవకాశం ఉండాలని అభ్యర్థిస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇందులో ఆలోచించడానికి ఏం లేదని, ప్రస్తుత కోర్సు విధానం సరిగ్గానే ఉందని తేల్చి చెప్పింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపేందుకు నిరాకరించింది. ప్రస్తుతం డిగ్రీ పూర్తి చేసినవారు మూడేళ్ల లా కోర్సులో, ఇంటర్ లేదా 12వ తరగతి ఉత్తీర్ణులైనవారు అయిదేళ్ల లా కోర్సులో చేరడానికి అర్హులు. అయితే, ఇంటర్ తర్వాత నేరుగా మూడేళ్ల కోర్సుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీని నియమించేలా కేంద్రం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించాలని కోరుతూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ పిటిషన్ దాఖలు చేశారు. మేధావులైన విద్యార్థులు మూడేళ్లలోనే న్యాయవాద కోర్సును పూర్తి చేయగలరని, ప్రస్తుత విధానం వల్ల అయిదేళ్ల కోర్సుతో వారికి సమయం వృథా అవు తుందని పేర్కొన్నారు. దీనివల్ల పేదలు, ముఖ్యంగా అమ్మాయిలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'మూడేళ్లు కూడా ఎందుకు.. హైస్కూల్ పూర్తవగానే నేరుగా లా ప్రాక్టీస్ మొదలు పెట్టేయండి' అంటూ పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. "వాస్తవానికి న్యాయవిద్యకు ఐదేళ్ల కోర్సు కూడా తక్కువే. అయితే ప్రస్తుత విధానం సరిగ్గానే పనిచేస్తోంది. దీనిపై ఆలోచించడానికి ఏం లేదు. ఇక, ప్రస్తుతం జిల్లాస్థాయి న్యాయవ్యవస్థల్లో 70 శాతం మంది మహిళలు ఉన్నారు. రానున్న రోజుల్లో మరింతమంది ఇందులో చేరుతారు' అని ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని ఆదేశించింది.

టిఫిన్‌బాక్స్ బాంబుతో దాడి: ముగ్గురికి గాయాలు

చెన్నై: మదురై జిల్లా మేలూరు సమీపం కీళవలైపు ప్రాంతం వద్ద విదేశాల్లో వ్యాపారం చేసే యువకుడిపై గుర్తు తెలియని దుండగులు టిఫిన్ బాక్స్ బాంబుతో దాడి చేశారు. ఈ సంఘటనలో ఆ యువకుడు, ఆటో డ్రైవర్ సహా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి... కీళవలైపు ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్ (30) తరచూ విదేశాలకు వెళ్లి వ్యాపార లావాదేవీలు జరుపుతున్నాడు. స్థానికంగాను కొన్ని వ్యాపారాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి కీళవలైపు బస్టాండు వద్ద నవీన్‌కుమార్ తన కారులో కూర్చుని స్నేహితుడితో మాట్లాడుతుండగా హఠాత్తుగా కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు టిఫిన్‌బాక్స్ బాంబుతో దాడి చేసి పారిపోయారు. బాంబు పేలుడు ఘటనలో నవీన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. బస్టాండు సమీపంలోని ఆటోస్టాండు వద్ద నిలిచిన ఆటో డ్రైవర్ కన్నన్, ఆ ప్రాంతంలో జిరాక్స్ దుకాణం నడుపుతున్న సత్యమూర్తి (40) గాయపడ్డారు.

30 వారాల గర్భవిచ్ఛిత్తికి అనుమతి

14 ఏళ్ల బాలిక కేసులో సుప్రీం అసాధారణ తీర్పు

న్యూఢిల్లీ: అత్యాచారానికి గురై గర్భం దాల్చిన ఓ 14 ఏళ్ల బాలికకు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. దాదాపు 30 వారాల ఆమె గర్భాన్ని వైద్యపరంగా విచ్ఛిత్తి చేసుకునేందుకు అనుమతించింది. దీనిని 'అసాధారణ' కేసుగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం... విస్తృత అధికారాలను ఉపయోగించి తీర్పు వెలువరించింది. మహారాష్ట్రకు చెందిన 14 ఏళ్ల బాలిక లైంగిక దాడికి గురై గర్భం దాల్చింది. కాస్త ఆలస్యంగా ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లి బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తన కుమార్తె 28 వారాల గర్భాన్ని తొలగించేందుకు అనుమతించాలని ఈ నెల ఆరంభంలో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గర్భవిచ్ఛిత్తికి నిరాకరించింది. ప్రస్తుతం ఆమె ప్రెగ్నెన్సీ చివరి త్రైమాసికంలో ఉందని, ఇప్పుడు విచ్ఛిత్తి చేస్తే పూర్తిగా రూపుదిద్దుకున్న పిండస్థ శిశువు జన్మించే అవకాశముందని అభిప్రాయపడింది. ఈ మేరకు బాలిక తల్లి పిటిషన్‌ను ఈ నెల నాల్గో తేదీన కొట్టేసింది. ఈ తీర్పుపై బాధితురాలి తల్లి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై గతవారం విచారణ జరిపిన న్యాయస్థానం... ముంబైలోని సియాన్ ఆసుపత్రి మెడికల్ బోర్డును నివేదిక కోరింది. గర్భవిచ్ఛిత్తిపై తీసుకునే నిర్ణయం వల్ల బాలిక శారీరక, మానసిక పరిస్థితి ఎలా ఉండనుందో చెప్పాలని సూచించింది. దీనిపై మెడికల్ బోర్డు న్యాయస్థానానికి నివేదిక సమర్పించింది. "ఈ సమయంలో గర్భవిచ్ఛిత్తితో కొంత ప్రమాదం ఉన్నప్పటికీ... కాన్పు తర్వాత ఎదురయ్యే ముప్పుతో పోలిస్తే ఇది ఎక్కువ కాదు. ఈ గర్భాన్ని కొనసాగించడం వల్ల బాలికపై శారీరకంగా, మానసికంగా ప్రతికూల ప్రభావం పడుతుంది" అని ఆ నివేదికలో పేర్కొంది. దీన్ని పరిశీలించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం బాలిక 30 వారాల గర్భవిచ్ఛిత్తికి అనుమతినిచ్చింది. బాధితురాలికి సంపూర్ణ న్యాయం అందించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద ఉన్న విస్తృత అధికారాలతో ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది. ఆ బాలికకు తక్షణమే వైద్య పరంగా గర్భవిచ్ఛిత్తి చేయాలని సియాన్ ఆసుపత్రి డీన్ ఆదేశించింది. సాధారణంగా మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం ప్రకారం.. వివాహిత మహిళలు, ప్రత్యేక అవసరాలున్నవారు, అత్యాచార బాధితులు 24 వారాల వరకు తమ గర్భాన్ని వైద్యుల సూచనల మేరకు విచ్ఛిత్తి చేసుకునేందుకు అనుమతి ఉంది. ఆ సమయం దాటితే న్యాయస్థానం అనుమతి తప్పనిసరి.

పేదల సర్కార్ కోసం ప్రజల ఎదురుచూపు

మల్లికార్జున ఖర్గే వెల్లడి

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మార్పుకోరుకుంటున్నారని, పేదల ప్రభుత్వాన్ని ఆశిస్తున్నారని, యువత ఉద్యోగాలు కోరుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కర్నాటకలో మొత్తం 28 సీట్లకుగాను తమ పార్టీ 15 నుంచి 20 స్థానాల్లో కచ్చితంగా విజయం సాధిస్తుందని ఖర్గే ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ వనరులను కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు ధారాదత్తం చేస్తుందని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే మండిపడ్డారు. మహిళలకు ఏటా రూ.లక్ష అందించడం ముస్లిం లీగ్ కార్యక్రమమా అని ప్రధానిని ఆయన నిలదీశారు. యువతకు ఉపాధి కల్పించడం, శిక్షణ కోసం వారికి రూ.లక్ష అందించడం ముస్లిం లీగ్ ప్రణాళికా అని ప్రశ్నించారు. తాము దేశ ప్రజల్లో ప్రతి ఒక్కరి కోసం 25 గ్యారంటీలు ప్రకటించామని, పేదలు, మహిళలు, యువత, దళితులు సహా అందరి సంక్షేమం కోసం హామీ ఇచ్చామని తెలిపారు. ప్రజలే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని, లేనిపక్షంలో దేశంలో సుపరిపాలన కొరవడుతుందని జవహర్‌లాల్ నెహ్రూ చెప్పేవారని గుర్తుచేశారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఏమి చేయడానికైనా కాషాయ నేతలు వెనుకాడటం లేదని, అదే దేశానికి ఉపయోగపడే పనులు మాత్రం చేయడం లేదని మండిపడ్డారు. హుబ్బలిలో యువతి నేహా హిరేమఠ్ హత్య కేసు ప్రస్తావిస్తూ ఎన్నికల్లో చాలామంది ఈ అంశాన్ని లేవనెత్తుతున్నారని, తాను ఈ ఘటనను ఖండిస్తున్నానని చెప్పారు.

ఉద్యోగాల కోసం 54.25 లక్షల మంది నిరీక్షణ

పెరంబూర్: రాష్ట్రంలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో ఉద్యోగాల కోసం పేర్లు నమోదుచేసుకున్న వారి సంఖ్య 54.25 లక్షలు ఉన్నట్లు తమిళనాడు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. గత మార్చి నెల గణాంకాల ప్రకారం ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో నమోదుచేసుకున్న వారి సంఖ్య 54,52,114గా నమోదైంది. వారిలో పురుషులు 25,00,134 మంది, మహిళలు 29,24,695 మంది కాగా, హిజ్రాలు 285 మంది ఉన్నారు. అలాగే, 18 ఏళ్లలోపున్న విద్యార్థులు 10.83 లక్షలు, 19 నుంచి 30 ఏళ్లలోపున్న విద్యార్థులు 23.92 లక్షలు, 31 నుంచి 45 ఏళ్లలోపున్న వారు 17.03 లక్షల మంది ఉన్నారు. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇస్తుండడంతో పేరు నమోదుచేసుకొనే వారి సంఖ్య పెరిగింది. 1,49,647 మంది దివ్యాంగులు పేర్లు నమోదుచేసుకోగా, వారిలో పురుషులు 99,680 మంది, మహిళలు 49,967 మంది ఉన్నట్లు ప్రభుత్వం తెలియజేసింది.

భారీ భద్రత నడుమ ఈవీఎం, వీవీప్యాట్‌లు

కృష్ణగిరి/ఈరోడ్: తమిళనాడులో అన్ని లోక్‌సభ స్థానాలకు తొలి దశలో ఏప్రిల్ 19వ తేదీన పోలింగ్ జరిగింది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఈ నేపథ్యంలో ఈవీఎంలతోపాటు వీవీప్యాట్ మెషిన్లను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. అయితే కృష్ణగిరిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈవీఎం, వీప్యాట్‌లకు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఉన్నతాధికారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ సీల్ వేశారు. ఇందులో ఆరు అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన 4,526 బ్యాలెట్ యూనిట్స్, 2,251 కంట్రోల్ యూనిట్స్‌తోపాటు 2392 వీవీ ప్యాట్స్ ఉన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కాలేజీ పరిసర ప్రాంతాల్లో 300 సీసీ టీవీ కెమెరాలను అమర్చినట్లు చెప్పారు. ఓ వేళ విద్యుత్ సరఫరా నిలిచినప్పుడు... జనరేటర్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. అగ్నిమాపక సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచామన్నారు. అలాగే ఈ కాలేజీ చుట్టు మూడంచల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశామని డీఎస్పీ తంగిదొరై తెలిపారు. అందులో భాగంగా 24 సీఆర్పీఎఫ్ సిబ్బంది, 45 తమిళనాడు స్పెషల్ బెటాలియన్ పోలీసులు, 253 మంది ఆర్మీ రిజర్వ్‌డ్ సిబ్బందితో కాలేజీ వద్ద పహారా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక ఈరోడ్‌కు సంబంధించిన ఈవీఎం, వీవీప్యాడ్‌లను చితోడేలోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజిలో భద్ర పరిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజ్ గోపాల్ సుంకర వెల్లడించారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత కల్పించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో 1,688 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించగా... 70.5 శాతం మేర రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగిందన్నారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కేరళలో బర్డ్‌ఫ్లూ స్వైరవిహారం

సరిహద్దుల్లో నిఘా

తిరువనంతపురం: కేరళ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ స్వైర విహారం చేస్తోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్ర సరిహద్దులకు ఆనుకునివున్న గ్రామాల్లో నిఘా పెట్టారు. ముఖ్యంగా కోళ్ల దాణా, కోళ్ల ఉత్పత్తులు, కోడిమాంసం, కోడిగుడ్లు వంటివి సరఫరా కాకుండా అడ్డుకుంటున్నారు. రాష్ట్రంలోని ఆలప్పుళా జిల్లాలోని కుట్టనాడులో బర్డ్‌ఫ్లూ కేసులు వెలుగు చూశాయి. కిలోమీటరు దూరంలోని కోళ్ళఫారాల్లో కోళ్లతో పాటు కోళ్ల ఉత్పత్తులను నిర్వీర్యం చేస్తున్నారు. రాష్ట్రాల మధ్య ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి రాష్ట్రంలోకి ప్రవేశించే సరకు రవాణా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అన్ని రకాల కోళ్ల ఉత్పత్తులను తిప్పి పంపుతున్నారు. బర్డ్‌ఫ్లూ కేసులు ప్రబలకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే, కూరగాయలు, ఇతర కిరాణా సరకులతో వచ్చే వాహనాలను కూడా తనిఖీ చేస్తున్నారు. ఈ వాహనాల టైర్లకు క్లోరిన్ డై ఆక్సైడ్ అనే రసాయనాన్ని పిచికారి చేస్తున్నారు. ఇందుకోసం ఒక పశుసంవర్ధక శాఖ అధికారి, ఒక అసిస్టెంట్, క్రిమి సంహారిణి పిచికారి చేసే ఇద్దరు సిబ్బంది సరిహద్దుల్లోని చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు నిత్యం విధుల్లో ఉంటున్నారు. కేరళ నుంచి కన్యాకుమారికి వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు వీలుగా కుమరి జిల్లా సరిహద్దుల్లో కూడా ప్రత్యేక చెక్ పోస్టులను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. పదందాలుమూడు చెక్‌పోస్టులో గట్టి నిఘా పెట్టారు. ఇక్కడ మూడు బృందాలుగా పశుసంవర్ధక శాఖ అధికారులు డ్యూటీ చేస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలో కోళ్ల పరిశ్రమకు పెట్టింది పేరైన నామక్కల్‌లోని కోళ్ల ఫారాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అన్ని కోళ్లఫారాల వద్ద క్రిమిసంహార మందులను పిచికారి చేస్తున్నారు. ఈ ఒక్క జిల్లాలోనే దాదాపు ఆరు కోట్ల కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో ఒక్క బర్డ్‌ఫ్లూ కేసు కూడా నమోదు కాలేదని కోళ్లఫారం యజమానులు అభిప్రాయపడుతున్నారు.

మతం ఆధారంగా పౌరసత్వం కుదరదు

సీఎం విజయన్

కన్నూరు: ఏ నాగరిక దేశమైనా మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వదని కేరళ సీఎం విజయన్ అన్నారు. దేశంలోని లౌకిక భావాలకు పౌరసత్వ సవరణ బిల్లు వ్యతిరేకమని ఆయన తెలిపారు. లౌకికవాదం రక్షణ కోరుతూ సీఏఏకు వ్యతిరేకంగా తాము పోరాడుతుంటే... కాంగ్రెస్ పార్టీ మాత్రం బీజేపీకి వ్యతిరేకంగా ఎటువంటి నిరసన తెలపలేదన్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం ఓ కార్యక్రమంలో పాల్గొన్న విజయన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏ నాగరికత దేశమైనా మతం ఆధారంగా పౌరసత్వాన్ని ఇవ్వలేదన్నారు. మతాన్ని ఆధారం చేసుకుని కాందిశీకులను విడదీయదన్నారు. పౌరసత్వం ఇచ్చి దాని ఆధారంగా మతాన్ని సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో బీజేపీ... ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేస్తున్నదని, కానీ కాంగ్రెస్ పార్టీ దాన్ని అడ్డుకోవడం లేదన్నారు. ఏప్రిల్ 26వ తేదీన జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ కూటమి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

డీప్ ఫేక్ వీడియోపై రణ్‌వీర్ సింగ్ ఫిర్యాదు

ముంబై: తాను ఓ రాజకీయ పార్టీ తరపున ప్రచారం చేస్తున్నట్లుగా ఉన్న డీప్‌ఫేక్ వీడియోపై బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రణ్‌వీర్ సహాయకులు ఈ విషయాన్ని తెలియజేస్తూ డీప్‌ఫేక్ వీడియోను ప్రచారం చేస్తున్న ఖాతాపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని తెలిపారు. ఎన్నికల సమయంలో పలువురు నటులు పార్టీలకు ప్రచారం చేస్తున్నట్లుగా ఉన్న డీప్ ఫేక్ వీడియోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో పోలీసులు ఇటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల రణ్‌వీర్ వారణాసి పర్యటనలో భాగంగా ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ వీడియోను ఏఐ ద్వారా మార్ఫింగ్ చేసి, ఆయన ఒక పార్టీ తరపున ప్రచారం చేస్తున్నట్లు రూపొందించారు. ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన రణ్‌వీర్ అది నిజం కాదని, ఫేక్ వీడియో అని తెలిపారు. డీప్‌ఫేక్ వీడియోలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

కేజ్రీవాల్ కోసం బెయిల్ పిటిషన్

న్యాయ విద్యార్థికి జరిమానా

న్యూఢిల్లీ: మద్యం పాలసీ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీ చేసిన సమన్లను సవాల్ చేస్తూ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. పిటిషనర్‌కు జరిమానా విధించింది. కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకొని అసాధారణ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని న్యాయ విద్యార్థి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషన్‌ను తిరస్కరిస్తూ... మధ్యంతర బెయిల్ కోరిన పిటిషనర్‌కు రూ.75వేల జరిమానా విధిందించింది. అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ కోసం న్యాయవిద్యార్థి పిల్ దాఖలు చేశాడు.

అయితే, కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిల్‌ను ఢిల్లీ ముఖ్యమంత్రి స్వయంగా వ్యతిరేకించారు. దీన్ని 'ఆకస్మిక దాడి'గా ఆయన అభివర్ణించారు. కేజ్రీవాల్ తరపు న్యాయవాది ఈ పిటిషన్‌ను 'పబ్లిసిటీ లిటిగేషన్'... రాజకీయ ప్రేరేపితమన్నారు. కేవలం పబ్లిసిటీ కోసం చేసిందని, పిటిషన్ దాఖలు చేయడానికి పిటిషనర్ ఎవరు అని కేజ్రీవాల్ తరపు సీనియర్ న్యాయవాది రాహుల్ మెహ్రా ప్రశ్నించారు. ఈ సందర్భంగా పిటిషనర్‌పై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఇండియా కూటమితోనే దేశానికి మేలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య

రాజంపేటలో విశ్వనాథ నాయక్ విజయం కోసం ప్రచారం

విశాలాంధ్ర -రాజంపేట: దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడు కోవడానికి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం రాజంపేటలో ఇండియా కూటమి బలపరిచిన రాజంపేట అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి బుక్కే విశ్వనాథనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. రాంనగర్, పాత బస్టాండ్ సర్కిల్లో ప్రచారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజానీకాన్ని ఉద్దేశించి ఈశ్వరయ్య మాట్లాడుతూ... కేంద్రంలోని మోదీసర్కారు, రాష్ట్రంలోని వైసీపీ సర్కారుపై నిప్పులుచెరిగారు.

రాష్ట్రంలో సకాలంలో ఉద్యోగులకు వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కాంట్రాక్టు, పొరుగు సేవలు సహా వివిధ పేర్లతో తాత్కాలిక సేవలు అందిస్తున్న చిరు ఉద్యోగులకైతే 3 నెలలు, 5 నెలలకు ఒక్కసారి జీతాలు ఇస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాలను దగా చేసిందన్నారు. అణగారిన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు అధికమయ్యాయని, ప్రజల ఆస్తులకు సైతం రక్షణ లేదని విమర్శించారు. ఐదేళ్లలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని... 25 ఎంపీ సీట్లు ఇస్తే.. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పిన సీఎం వైఎస్ జగన్... ఢిల్లీకి పోయిన ప్రతిసారీ మోదీ ముందు మోకరిల్లారని... విభజన హామీలలో ఏ ఒక్కటీ సాధించలేదని విమర్శించారు. రాష్ట్రంలో గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. కొత్త ప్రాజెక్టులు దేవుడెరుగు... పెండింగ్ ప్రాజెక్టులు కూడా ఏ ఒక్కటీ పూర్తి చేయలేదన్నారు. రాష్ట్రాన్ని గంజాయి కేంద్రంగా మార్చారని మండిపడ్డారు. మళ్లీ తామే గెలుస్తున్నట్లు తప్పుడు సర్వేలను ప్రచారం చేస్తుండడం సిగ్గుచేటన్నారు. ఇటువంటి వాటితో ఓటర్ల దృష్టిని ఏ మాత్రం మార్చలేరన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఇక కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించకపోతే దేశంలో రాజ్యాంగమే ఉండదని చెప్పారు. దేశాన్ని కాపాడుకోవాలన్నా, రాష్ట్రాన్ని రక్షించుకోవాలన్నా ఇండియా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించి చట్టసభలకు పంపించడం ఒక్కటే మార్గమన్నారు. ఇండియా కూటమి బలపర్చిన రాజంపేట అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి గా పోటీ చేస్తున్న బుక్కే విశ్వనాథ్ నాయక్ ను గెలిపించాలని ఈశ్వరయ్య ప్రజానీకాన్ని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.రాధాకృష్ణ, రాజంపేట నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణదేవర, సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రాయుడు, రైల్వే కోడూరు ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, నాయకులు సికిందర్, కేశం ప్రసాద్ రాజశేఖర్, నాగమ్మ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి మోదీ వ్యాఖ్యలు నిదర్శనం

రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రధాని నరేంద్రమోదీ ముస్లిం మైనారిటీలపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం బీజేపీ మత ఉన్మాదానికి అద్దంపడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. రాజస్థాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ... కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకొస్తే ప్రజల సంపదంతా ముస్లిం మైనారిటీలకు పంచుతుందని, అర్బన్ నక్సలిజం మనస్తత్వం ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళల మంగళసూత్రాలను కూడా వదలరని, వామపక్షాల ఉచ్చులో చిక్కుకున్న కాంగ్రెస్ మావోయిజం సిద్ధాంతాలు అమలు చేయాలని చూస్తోందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని రామకృష్ణ తప్పుబట్టారు. ప్రజల మధ్య మత విభజన తీసుకొచ్చి ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో బీజేపీ కుటిల రాజకీయానికి తెరతీసిందని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా సీఏఏ, ఎన్‌ఆర్‌సీలు తీసుకొచ్చిందన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ ప్రశ్నించే వారిపై దాడులు, బెదిరింపులు, అక్రమ కేసులు బనాయిస్తూ అణగదొక్కేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. పదేళ్ల బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశంలో ఏమి అభివృద్ధి జరిగిందో చెప్పుకోలేని స్థితిలో మోదీ సిగ్గువిడిచి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. అంబానీ, అదానీలకు అనుకూల చర్యలు తప్ప పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఒరగబెట్టింది శూన్యమని పేర్కొన్నారు. అప్పుల భారాలు, రూపాయి విలువ పతనం, రైతు కంటక చట్టాలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల భారీ పెరుగుదల వంటి భారాలను ప్రజలపై మోపడం తప్ప ఏమి సాధించారని ప్రశ్నించారు. ప్రపంచ పటంలో లౌకిక రాజ్యంగా పేరుగాంచిన భారతదేశ ప్రతిష్ఠను మంటగలిపేందుకు బీజేపీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నదన్నారు. దేశ ప్రగతిపై చెప్పుకోవడానికి ఏమీలేక కేవలం హిందూత్వవాదంతో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు మోదీ పచ్చి అబద్ధాలు చెబుతూ... వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గర్హనీయమని వ్యాఖ్యానించారు. ముస్లిం మైనారిటీలు, ఇండియా కూటమిపై మోదీ చేసిన తీవ్ర వ్యాఖ్యలను సీపీఐ ఖండిస్తోందని రామకృష్ణ స్పష్టంచేశారు.

నేడు జంగాల నామినేషన్

విశాలాంధ్ర-గుంటూరు: 'ఇండియా' కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ ఈ నెల 23వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి ర్యాలీగా బయలుదేరి గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు పాల్గొంటారు. 'ఇండియా' కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు కోరారు.

ఉద్యమ స్ఫూర్తి కలిగిన నేతలనే ఆదరించండి

సీపీఐ తిరుపతి అసెంబ్లీ అభ్యర్థి మురళిని గెలిపించండి

రామానాయుడు పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: ఉద్యమ స్ఫూర్తి కలిగిన నేతలనే ఆదరించి నిజాయితీ వైపు నిలవాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం 'ఇండియా' కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మురళి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం లక్ష్మీపురం, శ్రీనివాసపురం, నారాయణపురం, సిద్దయ్య కాలనీ, కైకాల చెరువు ప్రాంతాలలో సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానాయుడు, సీపీఎం నగర కార్యదర్శి సుబ్రమణ్యం కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మాగంటి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరం అభివృద్ధి చెందాలన్న, టీటీడీ నిధులు తిరుపతి అభివృద్ధికి ఉపయోగించాలన్న, మన్నవరం ప్రాజెక్టును సాధించుకోవడం కోసం, తిరుపతి ప్రాంత యువతీయువకులకు ఉద్యోగఉపాధి అవకాశాల కల్పనకు, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలుకు, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేలా చేయడానికి తిరుపతిలో 'ఇండియా' కూటమి బలపరిచిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థి మురళిని గెలిపించడం అవసరమని తెలిపారు. కార్మిక, కర్షక, పేద ప్రజలకు అండగా నిలవాలంటే మురళిని గెలిపించి అసెంబ్లీకి పంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు టి.జనార్దన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, సీపీఎం నాయకులు మాధవ్ కృష్ణ, వేణుగోపాల్, బుజ్జి, రమేష్, సీపీఐ నాయకులు బండి చలపతి, కత్తి రవి, ఎన్‌డీ రవి. శ్రీరాములు, పద్మనాభరెడ్డి, రామకృష్ణ, ఎ.బాబు, వైయస్ మణి, అల్లా బక్ష్, శ్రీనివాసులు, సిహెచ్ శివకుమార్, మునీశ్వర్ లక్ష్మి, గణేష్, త్రిమూర్తి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నవీన్ కుమార్, ప్రవీణ్, ఓం రాజ్, సురేష్, విజయమ్మ, రామ్మూర్తి, గోవిందస్వామి కాళయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

పన్నుల భారం తగ్గాలంటే కమ్యూనిస్టులను గెలిపించాలి

సీపీఐ విజయవాడ పశ్చిమ అభ్యర్థి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ నగరంలో ప్రజా సమస్యలను వైసీపీ ప్రజాప్రతినిధులు గాలికొదిలేశారని 'ఇండియా' కూటమి బలపరిచిన సీపీఐ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి జి.కోటేశ్వరరావు అగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్థానిక 52వ డివిజన్ కొండ ప్రాంతం మాకినవారి వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి తమకు మంచి స్పందన వస్తోందని తెలిపారు. గతంలో కమ్యూనిస్టు పార్టీ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు ప్రజలకు అందించిన సేవలను, నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని ప్రతి ఒక్కరూ గుర్తు చేస్తూ, ఈసారి ఎన్నికలలో తమకే ఓటు వేస్తామని చెబుతున్నారని ఆయన వివరించారు. ముఖ్యంగా కొండ ప్రాంతంలో మెట్లు, సైడ్ కాలువలు పాడైపోయాయని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసినా పైపులకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సైడు కాలువలు ధ్వంసమై ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని, దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో 49 మంది వైసీపీ కార్పొరేటర్లను ప్రజలు గెలిపించారని, అయినా మూడేళ్లుగా వారు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మంచి చేస్తారని గెలిపిస్తే ఆస్తి పన్ను, నీటి పన్ను, డ్రెయినేజీ పన్నులను భారీగా పెంచి నగర ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విజయవాడలో చెత్తపై కూడా పన్ను వసూలు చేస్తూ చరిత్రను సృష్టించిన చెత్త ప్రభుత్వానికి ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా గుణపాఠం చెప్పాలని కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ గుర్తించి, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రతి సమస్యపై పోరాడే కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. ప్రజలపై పన్నుల భారం లేని సుపరిపాలన కోసం, సామాన్యుల గొంతుకను చట్ట సభల్లో వినిపించేందుకు ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కంకి-కొడవలి గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు సింగరాజు సాంబశివరావు, స్థానిక పార్టీ కార్యదర్శి శీలం సోమేశ్వరరావు, ఆకుల యేసు, శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'పశ్చిమ' పారిశ్రామిక ప్రాంతంలో

సీపీఐ అభ్యర్థి విమల ప్రచారం

విశాలాంధ్ర-విశాఖ : విశాఖ పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం ఏడు గుడుల జంక్షన్‌లో సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల సోమవారం సాయంత్రం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీపీఐ, కాంగ్రెస్ నేతలు ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంచుతూ విమలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. స్టీల్ ప్లాంట్ మనుగడకు వామపక్ష అభ్యర్థి గెలుపు అనివార్యమని, మల్కాపురం ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు సీపీఐ కృషి చేస్తుందని విమల చెప్పారు. ఈ ప్రచారం సందర్భంగా మహిళలు హారతులు పట్టి విమలకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యంజనేయ, జి.రాంబాబు, కాంగ్రెస్ నేతలు నూకరాజు, ఎర్రయ్య, రజియా బేగం, సీపీఐ, మహిళా సంఘాల నేతలు ఆనంద్, సూరిబాబు, వనజాక్షి, బేగం, పరమేశ్వరి, పోతన్న, దుర్గారావు, జయ, విష్ణు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మతం ఆధారంగా పౌరసత్వం కుదరదు: సీఎం విజయన్

కన్నూరు: ఏ నాగరిక దేశమైనా మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వదని కేరళ సీఎం విజయన్ అన్నారు. దేశంలోని లౌకిక భావాలకు పౌరసత్వ సవరణ బిల్లు వ్యతిరేకమని ఆయన తెలిపారు. లౌకికవాదం రక్షణ కోరుతూ సీఏఏకు వ్యతిరేకంగా తాము పోరాడుతుంటే... కాంగ్రెస్ పార్టీ మాత్రం బీజేపీకి వ్యతిరేకంగా ఎటువంటి నిరసన తెలపలేదన్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం ఓ కార్యక్రమంలో పాల్గొన్న విజయన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏ నాగరికత దేశమైనా మతం ఆధారంగా పౌరసత్వాన్ని ఇవ్వలేద న్నారు. మతాన్ని ఆధారం చేసుకుని కాంది శీకులను విడదీయదన్నారు. పౌరసత్వం ఇచ్చి దాని ఆధారంగా మతాన్ని సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో బీజేపీ... ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అమలు చేస్తున్నదని, కానీ కాంగ్రెస్ పార్టీ దాన్ని అడ్డుకోవడం లేదన్నారు. ఏప్రిల్ 26వ తేదీన జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ కూటమి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్డీయే కూటమిదే అధికారం: చంద్రబాబు

విశాలాంధ్ర - జగ్గంపేట: రాష్ట్ర ప్రజల భవిష్యత్తును మేము బాధ్యతగా తీసుకుని రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తీసుకువెళ్తామని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం జగ్గంపేటలో నిర్వహించిన ప్రజా గళం సభలో ఆయన పాల్గొన్నారు. తొలుత గోకవరం రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలంలో దిగి జగ్గంపేట ఆర్టీసి కాంప్లెక్స్ సెంటర్ వద్ద సభస్థలానికి చేరుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనం నుండి చంద్రబాబు మాట్లాడుతూ గెలవబోయేది రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో గెలవబోయేది ఎన్డీఏకూటమి అభ్యర్థులేనని, రాష్ట్రంలో కూటమి అధికారం చేపడుతుందన్నారు. రాష్ట్రంలో చిన్న పిల్లలతో సైతం జగన్ గంజాయి అమ్మిస్తున్నారని ఆరోపించారు. పద్మభూషణ్ అవార్డు పొందిన చిరంజీవిని లాంటి వ్యక్తిని సైతం జగన్ విమర్శిస్తున్నారన్నారు. దళితుల్ని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తుల్ని పక్కన పెట్టుకున్న జగన్‌కు చిరంజీవిని, పవన్‌ను విమర్శించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. జగన్ రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని... టీడీపీ హయాంలో రూ.60 ఉండే క్వార్టర్ బాటిల్ లిక్కర్ ఇప్పుడు రూ. 200 అమ్ముతున్నారాన్నారు. నాసిరకం మద్యం తయారు చేసి క్వాటర్ రూ.200కు అమ్ముకుంటున్న జగన్‌కు పవన్ స్టార్‌గా వెలుగుతున్న పవన్‌ను విమర్శించే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. పవన్‌కు రాజకీయాలతో పనిలేదని, అయినా రాష్ట్రం బాగు కోసం శ్రమిస్తున్నారన్నారు. సంపద సృష్టించే పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రాన్ని కాపాడే బాధ్యత మేము తీసుకుంటామన్నారు. ఈ సభలో కాకినాడ పార్లమెంట్ జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:రాష్ట్రంలో పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. మంగళవారంతో 2023-24 విద్యా సంవత్సరం ముగియనుంది. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి. విద్యా సంవత్సరం ముగియక ముందే పదో తరగతి పరీక్షా ఫలితాలను విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. 47 రోజులపాటు వేసవి సెలవులతో పాఠశాలలు మూతపడనున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ హెచ్చరించింది.

బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎన్నిక ఏకగ్రీవం!

ఎన్నికలకు ముందే తొలి విజయం

అహ్మదాబాద్: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాతా తెరిచింది. గుజరాత్‌లోని సూరత్ స్థానం నుంచి ఆ పార్టీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈ నియోజకవర్గం నుంచి పోటీకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురవడం, పోటీలో ఇంకెవరూ లేకపోవడంతో దలాల్ విజయానికి మార్గం సుగమమైంది. సూరత్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న నీలేశ్ కుంభనీ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఆదివారం తిరస్కరించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన నేతల సంతకాల్లో అవకతవకలు జరిగినట్లు తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్వో వెల్లడించారు. ఆయనకు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ నుంచి వేసిన మరో నామినేషన్ కూడా చెల్లనిదిగా ప్రకటించారు. మరోవైపు, ఇదే స్థానం నుంచి పోటీకి దిగిన మిగతా ఎనిమిది మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరిరోజైన సోమవారం వీరంతా పోటీ నుంచి వైదొలిగారు. వీరిలో స్వతంత్రులతో పాటు బీఎస్పీ అభ్యర్థి కూడా ఉన్నారు. పోటీలో ముకేశ్ దలాల్ ఒక్కరే మిగలడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఆయన విజయంపై ఈసీ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని బీజేపీ గుజరాత్ అధ్యక్షుడు సీఆర్ పాటిల్ సోషల్ మీడియాలో వెల్లడిస్తూ దలాల్‌కు అభినందనలు తెలియజేశారు. "ప్రధాని నరేంద్ర మోదీకి సూరత్ తొలి కమలాన్ని అందించింది" అని రాసుకొచ్చారు. అటు గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ కూడా దీనిపై పోస్ట్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ చారిత్రక విజయానికి నాంది పడిందని... ప్రధాని మోదీ నాయకత్వంలో గుజరాత్ సహా దేశవ్యాప్తంగా 400 స్థానాలతో కమలం జయభేరీ మోగిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గుజరాత్‌లో 26 లోక్‌సభ స్థానాలకు మూడో విడతలో భాగంగా మే ఏడో తేదీన ఎన్నికలు జరగనున్నాయి.

సీఏఏ రాజ్యాంగాన్ని ఉల్లంఘించొచ్చు

అమెరికా కాంగ్రెస్ పరిశోధన విభాగం నివేదిక

న్యూయార్క్: భారత్ అమలులోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)లోని కొన్ని నిబంధనలు భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించేలా ఉన్నాయని అమెరికా చట్టసభల స్వతంత్ర పరిశోధన విభాగం కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) అభిప్రాయపడింది. ఈ మేరకు సీఏఏపై ఓ నివేదిక విడుదల చేసింది. అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లోని ముస్లింలు మినహా మిగతా ఆరు మతాల వారికీ పౌరసత్వం కల్పించే నిబంధన.. .రాజ్యాంగంలోని కొన్ని అధికరణలను ఉల్లంఘించొచ్చని అభిప్రాయపడింది. పౌరుల జాతీయ రిజిస్టర్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఇవి భారత ముస్లింల హక్కులను ఉల్లంఘించొచ్చని పేర్కొంది. సీఏఏ వ్యతిరేకుల అభిప్రాయాలను కూడా కాంగ్రెస్ పరిశోధన విభాగం తన నివేదికలో పొందుపరిచింది. హిందూ ఆధిపత్య పాలన కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని కొందరు భయపడుతున్నట్టు తెలిపింది. ముస్లిం వ్యతిరేక విధానాలతో దేశానికున్న సెక్యులర్ స్వభావానికి ప్రమాదం ఉందని భావిస్తున్నట్టు వెల్లడించింది. ఇది రాజకీయ లక్ష్యాలతో తెచ్చిన చట్టమని కూడా కొందరు భావిస్తున్నారని తెలిపింది. కొన్ని మతాలవారికి మినహా మిగతా వారికి భారత పౌరసత్వం పొందేందుకు పరిమితమైన అవకాశాలు ఉండేలా చట్టం తెచ్చారన్న అభిప్రాయాన్ని కూడా ఈ నివేదికలో పొందుపరిచారు. 1955 నాటి పౌరసత్వ చట్టాన్ని సవరిస్తూ భారత ప్రభుత్వం నూతన పౌరసత్వ సవరణ చట్టం తెచ్చిన విషయం తెలిసిందే. ఈ చట్టం ప్రకారం..2014, డిసెంబర్ 31కి ముందే భారత్‌కు వచ్చిన బంగ్లాదేశీయులు, పాకిస్థానీలు, అఫ్గానిస్థాన్‌లోని ముస్లింలు మినహా మిగతా ఆరు మతాల వారికి పౌరసత్వం కల్పిస్తారు.

సీఏఏలో ఏముందంటే...?

- సీఏఏ%-%2019 చట్టం ప్రకారం మతపరమైన ఊచకోత బాధితులైన మైనారిటీలకు భారత పౌరసత్వం కల్పిస్తారు.
- 2014 డిసెంబర్ 31కి ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులు ఇందుకు అర్హులు.
- అంతకుముందు కనీసం ఏడాది నుంచి భారత్‌లో ఉంటున్నవాళ్లకు, 14 ఏళ్లలో కనీసం ఐదేళ్లు ఉన్నవాళ్లకు పౌరసత్వం కల్పిస్తారు. గతంలో 11 ఏళ్లుండగా ఐదేళ్లకు తగ్గించారు.
- ఇందుకు వీరు ఎలాంటి శరణార్థి తదితర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరముండదు. ఈ మేరకు పౌరసత్వ చట్టం%-%1955కు మోదీ సర్కారు సవరణలు చేసింది.
- అసోం, మేఘాలయ, మిజోరం, త్రిపురల్లోని గిరిజన ప్రాంతాలను ఈ చట్టం పరిధి నుంచి మినహాయించారు.

వయనాడ్‌లో రాహుల్‌కు షాక్: బీజేపీలోకి కీలక నేత

తిరువనంతపురం: వయనాడ్ లోక్‌సభ నుంచి మరోసారి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి గట్టి షాక్ తగిలింది. వయనాడ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) మాజీ ప్రధాన కార్యదర్శి పీఎం సుధాకరన్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ జిల్లా నాయకులకు అందుబాటులో లేరంటూ ఆరోపించారు. "నాలాంటి నాయకుడికే ఆయన (రాహుల్ గాంధీ) అందుబాటులో లేనట్లయితే, ఇక సామాన్యుడి పరిస్థితిని ఊహించుకోండి. ఆయనకి ఐదేళ్లు గడువు ఇచ్చాం. మరోసారి పదవీకాలం ఇస్తే, అది వయనాడ్ అభివృద్ధి అవకాశాలను నాశనం చేస్తుంది" అన్నారు. కాగా శనివారం మహారాష్ట్రలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ చురక అంటించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

ఓటింగ్‌పై అవగాహన

బాలికలకు మెహందీ పోటీ

సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఇందుకోసం యువతీయువకులను ప్రోత్సహించేందుకు వినూత్న రీతిలో అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకోబేయే యువతుల కోసం పంజాబ్, ఫరీద్‌కోట్‌లో వినూత్నమైన మెహందీ పోటీ జరిగింది. మహేంద్ర బ్రార్ శాంభి ప్రభుత్వ బాలికల సీనియర్ సెకండరీ స్మార్ట్ స్కూలు విద్యార్థులు ఓటింగ్ ప్రాధాన్యతను తెలియజేసే సందేశాలతో మెహందీ డిజైన్లు గీస్తూ అవగాహన కల్పించారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా ఓటింగ్‌పై అవగాహనను కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసిస్టెంట్ నోడెల్ అధికారి జస్సీ తెలిపారు.

మహిళలకు 'పీటీఎం'లు

- బొకారోలోని 1,590 స్కూళ్లలో నిర్వహణ
- లక్ష మంది హాజరు

జార్ఖండ్‌లోని బొకారోలో వినూత్న రీతిలో ఓటింగ్‌పై అవగాహనను ఎన్నికల అధికారులు కల్పించారు. 'పేరేంట్స్-టీచర్స్ మీటింగ్' (పీటీఎం) నిర్వహించారు. ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కోసం ఈ విన్నూత పద్ధతిని అనుసరించినట్లు సీనియర్ అధికారి తెలిపారు. ధన్‌బాద్, గిరిధ్ నియోజకవర్గాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సమావేశానికి హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించినట్లు చెప్పారు. మొత్తం 1.51లక్షల గ్రామీణ మహిళలను క్రియాశీలం చేశామన్నారు. 796 గ్రామాల నుంచి మహిళలను సమీకరించి 1,590 స్కూళ్లలో పీటీఎంలు నిర్వహించినట్లు బొకారో జిల్లా ఎన్నికల అధికారి, డిప్యూటీ కమిషనర్ జాదవ్ విజయ నారాయణ రావు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 27న ధన్‌బాద్, గిరిధ్‌లో పోలింగ్ జరగనున్నది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బొకారో 51శాతం పోలింగ్ నమోదైంది. గిరిధ్ లోక్‌సభ స్థానం పరిధిలో 18.35 లక్షల మంది ఓటర్లు ఉండగా ధన్‌బాద్‌లో 22.48లక్షల మంది ఉన్నారు. జార్ఖండ్‌లో మొత్తం నాలుగు దశల్లో ఎన్నికలు జరుగుతాయి. మే 13, 20, 25, జూన్ 1న పోలింగ్ ఉంటుంది.

లెఫ్ట్‌ను మింగేసిన మత రాజకీయం

ఫైజాబాద్, వారణాసి కమ్యూనిస్టులకు పెట్టని కోట

లాల్‌బహదూర్ శాస్త్రినే ఓడించిన సీపీఐ

పార్లమెంటరీ రాజకీయాలలో వామపక్ష పార్టీల ప్రభావం తగ్గడం ఆ పార్టీలకే కాక ఇతర పార్టీలకు కూడా ఆశ్చర్యం కలిగిస్తోంది. దేశమంతటా ఇదే ధోరణి కనిపిస్తోంది. దేశంలో అత్యధిక పార్లమెంట్ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లోని అనేక లోక్‌సభా నియోజకవర్గాలు ఒకప్పుడు కమ్యూనిస్టులకు పెట్టని కోటల్లాగా ఉండేవి. కాషాయ కరసేవకులు విధ్వంసం చేసిన బాబ్రీమసీదు, రాముని జన్మస్థలంగా చెపుతున్న అయోధ్య ఉన్న ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కూడా ఇదివరకు అరుణపతాకం రెపరెపలాడింది. పుణ్యక్షేత్రంగా పేర్కొనే వారాణసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి గతంలో సీపీఎం విజయం సాధించింది. మాజీ ప్రధాన మంత్రి లాల్ బహుదూర్ శాస్త్రిని శాసనసభ ఎన్నికలలో ఓడించిన చరిత్రసీ సీపీఐకి ఉంది. మూడు దశాబ్దాల క్రితం కుల రాజకీయాలు, మత రాజకీయాలు పెచ్చరిల్లిన తరువాత కాలక్రమేణా కమ్యూనిస్టుల ప్రాబల్యం క్షీణించడం ప్రారంభమైంది. ములాయం సింగ్ యాదవ్, కాన్షీరామ్ వంటి నాయకుల రాజకీయ ప్రవేశం తరువాత రాష్ట్ర రాజకీయ దృశ్యం మారిపోయింది. బాబ్రీమసీదు విధ్వంసం, రామాలయ నిర్మాణం పేరుతో కాషాయ పార్టీ పుంజుకోవడం ప్రారంభించిన అనంతరం వామపక్షాల అస్తిత్వమే ప్రశ్నార్థకం అయింది.

రాజకీయాలలో కులం ప్రభావం పెరగడంతో యూపీలో రాజకీయ దృశ్యం మారడం మొదలైంది. 1989లో బీజేపీ రామజన్మభూమి ఆందోళన తర్వాత మతం ప్రధానాంశం అయిన తరవాత రాజకీయాలు పూర్తిగా పెడదారి పట్టాయి. ఓటర్ల ఆలోచనా ధోరణిని మత రాజకీయాలు కలుషితం చేశాయి. ఓటర్లు వామపక్ష పార్టీలకు దూరం కావడానికి కుల మతాల ఆధారంగా రాజకీయాలు చేయడమే ప్రధాన కారణం. ప్రజా రాజకీయాల స్థానాన్ని మత రాజకీయాలు ఆవహించడంతో కాషాయ పార్టీ ఎదుగుదల పెరుగుతూ వచ్చింది. అయోధ్య, వారణాసి లాంటివి పుణ్య క్షేత్రాలైనా రాజకీయాల దగ్గరకు వచ్చే సరికి మత ప్రభావం లేనంత కాలం కమ్యూనిస్టు పార్టీలకు ఆ ప్రాంతాలు పెట్టని కోటలుగానే ఉన్నాయి.

రాష్ట్రంలోని ఘోసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి 1962, 1967 ఎన్నికలలో సీపీఐ అభ్యర్థి జై బహదూర్ సింగ్, 1968లో జరిగిన ఉప ఎన్నికలో, 1971, 1980 ఎన్నికలలో జార్ఖండ్ రాయ్ సీపీఐ తరపున ఈ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. బందా లోక్‌సభ నియోజకవర్గం నుంచి 1967లో జాగేశ్వర్ యాదవ్, 1989లో రామ్ సజీవన్ విజయఢంకా మోగించారు. ఘాజీపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 1967, 1971 ఎన్నికలలో సర్జూపాండే, 1991లో విశ్వనాథ శాస్త్రి సీపీఐ అభ్యర్థులుగా విజయం సాధించారు.

బాబ్రీమసీదు, రాముని జన్మస్థలంగా చెపుతున్న అయోధ్య ఉన్న ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో కూడా అరుణపతాకం రెపరెపలాడింది. ఈ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి మిత్రసేన్ యాదవ్ విజయం సాధించారు. ఇక కాశీ పుణ్యక్షేత్రంగా పేర్కొనే వారణాసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి 1967లో సీపీఎం అభ్యర్థి సత్యనారాయణ సింగ్, 1989లో కాన్పూర్ నుంచి సుభాషిణీ అలీ విజయం సాధించారు.

రాష్ట్ర అసెంబ్లీలో 1951 నుంచే సీపీఐ ప్రాతినిధ్యం కలిగివుంది. 1951 ఎన్నికలలో సీపీఐ 43 మందిని పోటీకి నిలపగా ఒక్కరే విజయం సాధించారు. 38 మంది డిపాజిట్ కోల్పోయారు. 1957 ఎన్నికలలో సీపీఐ తరపున 9 మంది విజయం సాధించారు. ఈ ఎన్నికలలో వారణాసిలోని కొలస్లాహ్ అసెంబ్లీ నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి ఉదల్ తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి లాల్ బహదూర్ శాస్త్రిని 2,266 ఓట్ల తేడాతో ఓడించారు. ఆ ఎన్నికలలో సీపీఐ ప్రముఖులు జార్ఖండ్‌రాయ్, సర్జూపాండే వరుసగా మహ్మదాబాద్, ఘోసి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి విజయం సాధించారు. 1985 లో మినహా 1993 అసెంబ్లీ ఎన్నికల వరకు ఉదల్ కొలస్లాహ్ శాసనసభ నియోజకవర్గం నుంచి గెలుస్తూనే ఉన్నారు. 1985 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి రామ్‌కరన్ పాటిల్ గెలుపొందారు. 1962 ఎన్నికలలో కొలస్లాహ్, ఘోసి వంటి ముఖ్యమైన సీట్లను నిలుపుకోవడంతోపాటు మొత్తం 14 నియోజక వర్గాలలో సీపీఐ గెలుపొందింది. ఓట్ల శాతాన్ని కూడా 14.86 శాతానికి పెంచుకున్నది. పార్టీలో చీలిక అనంతరం 1967లో జరిగిన ఎన్నికల్లో సీపీఎంకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ పార్టీ 57 చోట్ల పోటీచేసి కేవలం ఒక్క చోట మాత్రమే విజయం సాధించింది. 47 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. ఈ ఎన్నికలలో సీపీఐ బలం ఒక సీటు తగ్గింది. 13 సీట్లలో గెలుపొందిన సీపీఐ ఓట్ల శాతాన్ని స్వల్పంగా 14.87 శాతానికి పెంచుకున్నది. 1969లో సీపీఐ బలం నాలుగు సీట్లకు తగ్గింది. ఓట్ల శాతం మాత్రం 19.27 శాతానికి పెరిగింది. సీపీఎం ఒక స్థానంలో గెలుపొందింది. 1974 ఎన్నికలలో సీపీఐకి భారీ విజయమే లభించిందని చెప్పవచ్చు. ఆ ఎన్నికలలో సీపీఐ 40 చోట్ల పోటీచేయగా 16 మంది గెలుపొందారు. ఓట్ల శాతం 25.57 శాతానికి పెరిగింది. సీపీఎం తరపున 36 మంది పోటీచేయగా ఇద్దరు విజయం సాధించారు. 1977 ఎన్నికలలో సీపీఐ సీట్లు తగ్గగా, ఓట్ల శాతం గణనీయంగా (34.91 శాతం) పెరిగింది. ఆ ఎన్నికలలో 29 మంది అభ్యర్థులు పోటీ చేయగా తొమ్మిది మంది గెలుపొందారు. సీపీఎం తరపున 35 మంది పోటీచేయగా ఒక్కరు విజయం సాధించారు. 33 చోట్ల ఆ పార్టీ అభ్యర్థులు ధరావతు కోల్పోయారు. 1980 ఎన్నికలలో సీపీఎం ఖాతా తెరవనప్పటికీ 10.36 శాతం ఓట్లు పొందింది. సీపీఐ 7 చోట్ల విజయం సాధించింది. ఓట్ల శాతం 9.75 శాతానికి పడిపోయింది. 1985 ఎన్నికలలో సీపీఐ 8.1 శాతం ఓట్లతో ఆరు సీట్లలో విజయం సాధించింది. సీపీఎం 25 నియోజకవర్గాలలో పోటీచేసి రెండు చోట్ల విజయం సాధించింది. 1989 ఎన్నికలలో ఇదే పరిస్థితి పునరావృతం అయింది. 1994 ఎన్నికలలో సీపీఐ4, సీపీఎం ఒక చోట గెలుపొందాయి. 1996లో సీపీఐ ఒకటి, సీపీఎం నాలుగు చోట్ల విజయం సాధించింది. 2002లో సీపీఐ ఒక్క స్థానంలో కూడా గెలుపొందలేదు. సీపీఎం రెండు చోట్ల గెలుపొందింది.

సర్జూ పాండే

ఎస్.ఎం.బెనర్జీ

మిత్రసేన్ యాదవ్

ఉదల్

లాల్‌బహదూర్ శాస్త్రి

1990 తరవాత కుల, మత రాజకీయాలు రావడంతో వామపక్ష భావజాలం పక్కకు తొలిగిందన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. "రాష్ట్రంలో వామపక్ష పార్టీలకు పునాది లేనట్లు కాదు. దాదాపు 65 జిల్లాలో సీపీఐ శాఖలు, ప్రజా సంఘాలను కలిగి ఉంది, అయితే వనరుల కొరత కారణంగా వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర వామపక్ష పార్టీల పరిస్థితి కూడా అలాగే ఉంది" అని విశ్లేషకులు చెపుతున్నారు. వామపక్షాల సైద్ధాంతిక పోరాటాలు, త్యాగపూరిత చరిత్ర గురించి యువతరానికి అంతగా తెలియకపోవడం కమ్యూనిస్టుల ఓటుబ్యాంకు తగ్గిపోవడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

కుల ఆధారిత పార్టీల ఆవిర్భావం, బీజేపీ నేతృత్వంలోని మతతత్వం వామపక్షాల ప్రాబల్యం తగ్గడానికి కారణమని సీపీఐ సీనియర్ నాయకుడు డాక్టర్ గిరీష్ అన్నారు. శ్రమజీవులు, కార్మికులు,పేదల కోసం నిరంతరం పోరాడుతునప్పటికీ, పరిమిత నిధులు, మారుతున్న ఓటరు విధేయత కారణంగా వామపక్షాలు ఎన్నికల పోరులో విజయం సాధించలేకపోతున్నాయని చెప్పవచ్చు. 1991 నుంచి ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు యూపీ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యంలేదు. మునుపటి విజయాలతో పోలిస్తే ఈ మార్పు వామపక్ష పార్టీల తిరోగమనాన్ని సూచిస్తోంది. వామపక్ష కార్మిక నాయకుడు ఎస్ఎం బెనర్జీ నాలుగు సార్లు గెలిచిన కాన్పూర్ వంటి సంప్రదాయక కోటలలో కూడా కాషాయ రాజకీయాల పెరుగుదల కమ్యూనిస్టుల ప్రభావాన్ని అధిగమించింది. రామజన్మభూమి ఉద్యమం కమ్యూనిస్టు, సోషలిస్ట్ పార్టీలను తీవ్రంగా దెబ్బతీసింది. పూర్వం ఈ పార్టీలకు మద్దతుదార్లుగా ఉన్న చాలా మంది కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ, చివరికి బీజేపీ వైపు ఆకర్షితులయ్యారు. రాష్ట్రంలో వామపక్షాలు బలం కోల్పోతున్నందున, ఒకప్పుడు ఎర్రగా ఉన్న దాని కోటలు ఇప్పుడు కాషాయ రంగులోకి మారాయి, ఇది రాష్ట్ర రాజకీయ దృశ్యంలో గణనీయమైన మార్పుకు ప్రతీక. ఎన్నికలలో పోటీ చేయడానికీ. అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి అడపాదడపా ప్రయత్నాలు చేసినప్పటికీ ఆ ప్రయత్నాలు ఆశించిన విధంగా సఫలంకాలేదు. రాష్ట్రం నుంచి చట్ట సభలలో ప్రాతినిధ్యం సుదూర కలగానే ఉండిపోయింది. జన రాజకీయాల స్థానాన్ని కుల, మత రాజకీయాలు ఆక్రమించాయి.



ఎన్డీయే గెలుపు కష్టమే!

- కర్నాటక, బెంగాల్, బీహార్‌లో అననుకూల పరిస్థితులు
- ప్రాంతీయ పార్టీల జోరు
- గట్టి పోటీ ఇస్తున్న కాంగ్రెస్
- లోక్‌పోల్ సర్వేలో వెల్లడి

బీజేపీకి ముందున్నది మొసళ్ల పండుగ... సన్నగిల్లిన గెలుపు అవకాశాలు... తగ్గబోతున్న స్థానాలు... హిందీ రాష్ట్రాల్లోనూ చేజారబోతున్న స్థానాలు... దక్షిణ రాష్ట్రాల్లో కమలం వికాసం కల్ల... ఇది ఎన్నికల ప్రీపోల్ సర్వేల అంచనా. కమల దళానికి స్థానాలతో పాటు ఓట్ల శాతం కూడా భారీగా తగ్గబోతోంది. కాషాయ పార్టీకి చాలా స్థానాల్లో గట్టి పోటీ ఎదురవుతున్నది. గతంలో కంటే సీట్లు తగ్గుతాయని నివేదికలు చెబుతున్నాయి. కర్నాటకలో ఎన్డీయే పతనమవుతుందని, తమిళనాట డీఎంకే స్వీప్ చేస్తుందని లోక్‌పోల్ సర్వే తేల్చింది. ఎడినా సర్వే కూడా కర్నాటకలో కమలం వికసించదని పేర్కొంది.

'అబ్ కి బార్ 400 పార్' నినాదంతో ప్రచారాన్ని బీజేపీ హోరెత్తిస్తున్నది. అనుకున్న లక్ష్యాన్ని ఛేదించేందుకు అన్ని రాష్ట్రాలపై దృష్టి పెట్టింది. ఉత్తరాది రాష్ట్రాల్లో అనుకూలంగా లేని స్థానాలకు బదులుగా దక్షిణాది స్థానాలను కైవసం చేసుకొని లెక్క సరిపెట్టాలని శాయాశక్తులు ఒడ్డుతున్నది. గెలుపే లక్ష్యంగా అన్ని అస్త్రశస్త్రాలు ప్రయోగిస్తోంది.

ఎన్డీయేకు ఈసారి సీట్లు గణనీయంగా తగ్గుతాయని 'లోక్‌పోల్' సర్వే అంచనా వేసింది. సార్వత్రిక ఎన్నికల్లో హిందీ రాష్ట్రాల్లోనూ బీజేపీకి గెలుపు సునాయాసం కాబోదని పేర్కొంది. ఎక్కడ కూడా నల్లేరుపై నడకగా పరిస్థితి లేదని వెల్లడించింది. దక్షిణ రాష్ట్రాల్లో ప్రస్తుతమున్న స్థానాలను కూడా బీజేపీ చేజార్చుకోబోతున్నట్లు సర్వే నివేదిక తెలిపింది. తాజాగా నాలుగు రాష్ట్రాల్లో సర్వే నిర్వహించి నివేదికను వెలువరించింది. చేజార్చుకునే స్థానాలను భర్తీ చేసేందుకు దక్షిణ రాష్ట్రాల్లో స్థానాలు గెలుచుకోవాలన్న వ్యూహం ఫలించబోదని లోక్‌పోల్ పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లో ఎన్డీయే బలంగా ఉంటుందని, 25 స్థానాలను గెలుచుకుంటుందని అంచనా వేసింది. ఇండియా కూటమికి 10, బీఎస్పీకి నాలుగు చొప్పున స్థానాలు లభిస్తాయనని పేర్కొంది.

ప్రతిష్ఠాత్మకంగా మారిన మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ నేతృత్వ మహాయుతి కూటమికి మహావికాస్ అగాధీ నుంచి గట్టి పోటీ ఉంటుందని పేర్కొంది. ఎన్డీయేలోకి జేడీయూ వచ్చి చేరినప్పటికీ బీహార్‌లో దాని ప్రభావం పెద్దగా ఉండదని, అక్కడ నితీశ్ కుమార్‌కు అనుకూల పవనాలు లేవని తేలిపింది. ఎన్డీయేకు 25, ఇండియా కూటమికి 16 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. ఇక పశ్చిమ బెంగాల్‌లోనూ బీజేపీ 13 స్థానాలకు పరిమితమవుతుందని, తృణమూల్ కాంగ్రెస్ 28 స్థానాలు గెలచుకుంటుందని వెల్లడించింది. వామపక్ష కూటమి పుంజుకుంటుందని కూడా సర్వేలో వెల్లడైంది. కాగా, ఈశాన్యంలో బీజేపీకి ఎనిమిది స్థానాలు ఉంటే... అందులో సగానికిపైగా ఇండియా కూటమి వశమవుతాయని తేల్చింది. తమిళనాడులో డీఎంకే స్వీప్ చేస్తుందని, ఇండియా కూటమి 39 స్థానాల్లో గెలుస్తుందని పేర్కొంది.

కర్నాటక కాంగ్రెస్‌దే!

బీజేపీకి దక్షిణాదిన కంచుకోటగా భావించే కర్నాటకలో కమలం వికసించే పరిస్థితి లేదని సర్వే తేల్చింది. ఎన్డీయే కూటమి పతనమవుతుందని, 13కు మించి స్థానాలు రావని ఎడినా సర్వేలోనూ తేలింది. కాంగ్రెస్ అనూహ్య విజయాన్ని నమోదు చేస్తుందని పేర్కొంది. కర్నాటకలో 28కుగాను 18స్థానాలలో కాంగ్రెస్ గెలుస్తుందని పేర్కొంది. ఆ పార్టీ ఓట్లు కూడా 46.41శాతానికి పెరుగుతాయని వెల్లడైంది. బీజేపీ, దాని మిత్రపక్షం జేడీఎస్ 10-13 స్థానాలతో సరిపెట్టుకోవాల్సిందేనని నివేదిక తెలిపింది. ఇదిలావుంటే, ఎన్డీయేకు వచ్చే ఓట్లలోనూ తగ్గుదల నమోదు కాబోతోంది. 44.27శాతం ఓట్లు కాషాయ వర్గానికి ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు 140కుగాను 132 స్థానాల్లో గెలిచి బీజేపీని ఓడిస్తామని కాంగ్రెస్ ముందే చెప్పింది. ఎన్నికలకు ముందు జరిగిన సర్వేలు సైతం కాంగ్రెస్ గెలుస్తుందనే చెప్పాయి.

సీపీఐ అభ్యర్థులు

రాజంపేట

బుక్కే విశ్వనాథ నాయక్

రాయచోటి జిల్లా రాజంపేట శాసనసభా నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా బుక్కే విశ్వనాథ నాయక్ పోటీచేస్తున్నారు. ఆయన విద్యావంతుడు, ఎంఏ బీఈడీ చేశారు. భాగంపల్లె గ్రామపంచాయతీ మారుమూల గ్రామం కుప్పగుట్టకు చెందిన బుక్కే రాము నాయక్ యశోద దంపతులకు ద్వితీయ సంతానంగా విశ్వనాథ నాయక్ జన్మించారు. 2007లో విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితం ప్రారంభించారు.ఆయన తండ్రి రాము నాయక్ మాజీ సర్పంచ్. వివిధ పత్రికలలో పాత్రికేయుడుగా పనిచేసిన అనుభవం ఉంది. భారత కమ్యూనిస్టు పార్టీలో చేరి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడుగా, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా అతి చిన్న వయసులో అంచలంచలుగా ఎదిగారు. పింఛ ప్రాజెక్టు నుంచి రాయచోటి మీదగా అన్నమయ్య జిల్లా కేంద్రం వరకు పాదయాత్ర నిర్వహించారు. అక్రమంగా దళితుల మామిడి చెట్లు నరికి వేస్తే మామిడి చెట్లు నాటించడం,అంగన్వాడి సమస్యలపై పోరాటం చేసి జైలుకు వెళ్లడం, గిరిజనులకు అటవీ భూములు పంపిణీ చేయాలని ఉద్యమం చేసి కేసులు ఎదుర్కొన్నారు. అనేక సమస్యలపై పోరాటం చేశారు. సుండుపల్లె మండల ప్రధాన సమస్యలపై గళం విప్పి సుండుపల్లె రాయచోటి పించా వరకు రెండు వరుసల రోడ్డు, ఝరికోన ప్రాజెక్టు నుంచి కుడి ఎడమ కాలువలకు నిధులు మంజూరు చేయాలని పోరాటం, మండల ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం రోళ్ళమడుగు మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేయాలని పోరాటం చేయడం ద్వారా ప్రజానాయకుడిగా వెలుగొందుతున్నారు. ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. సీపీఐలో చురుకుగా ఉంటూ పార్టీ విస్తరణకు కృషిచేశారు.

నిజంగా గాయపడ్డది ప్రజాస్వామ్యం

ఎప్పుడూ లేనిది ఇప్పుడు
గాయాలవుతున్నాయి కొత్తగా
ఒకప్పుడు పూలు విసరడం
పూల మాలలు విసరడం చూశాము
అప్పట్లో
పేదల పక్షపు ప్రజానాయకుడని అభ్యర్థి
ఎన్నికల ఖర్చుల కోసం పదులు యిరవైల
కరెన్సీ నోట్ల దండలు ఓటర్లే వేయడం చూశాము
ఇప్పుడు మరిదేమిటో...!
నాయకుల ఎన్నికల సభల్లో గాల్లోకి
ఏవేవో ఎగురుతున్నాయ్
వేదికలవైపుకు వెళుతున్నాయ్
కొన్ని తగులుతున్నాయ్
తప్పుకొంటున్నాయి మరికొన్ని
పాపం! గాయాలవుతున్నాయ్
కనిపించే గాయాలు కొన్నే
ఇంతకీ ఇలా ఎందుకూ...!?
నాయకుల సంగతి
ఏమోలే గాని
ఒకరు నిజంగా గాయపడ్డారు
విసిరిన వాటివల్ల కాదు
చేతల వల్ల
కనకపు సింహాసనం ఎక్కించినా
వెనకటి గుణం మారని నేతల చేతల వల్ల
నిజంగా గాయపడ్డది మన ప్రజా స్వామ్యం

– కె. శరచ్ఛంద్ర జ్యోతిశ్రీ

హోరాహోరీ

బరిలో హేమాహేమీలు - పోటాపోటీ ప్రచారం - గెలుపుపై ధీమా

తెలుగు-తమిళ సంస్కృతుల సమ్మేళనం, రాజకీయ దిగ్గజాలకు నిలయం... 1911 నుంచి జిల్లాగా, అసెంబ్లీ నియోజకవర్గంగా ఆవిర్భావం... తొలి ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థికే పట్టం... స్థానికులకు రాజకీయ పార్టీల కన్నా వ్యక్తులే ప్రధానం... ఇది చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ముఖచిత్రం.

చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. చిన్నంరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ ఏడు సార్లు, తెలుగుదేశం పార్టీ మూడు సార్లు, స్వతంత్రులు రెండు సార్లు ఎన్నిక కాగా జనతా, స్వతంత్ర పార్టీల అభ్యర్థులు ఒకసారి చొప్పున గెలిచారు. సీకే బాబు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఒక పర్యాయం స్వతంత్రుడిగా, మూడు పర్యాయాలు కాంగ్రెస్ తరపున ఎన్నికయ్యారు. 1952లో కృషి కర్ లోక్ పార్టీకి చెందిన సింగారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శ్రీనివాసులు విజయం సాధించారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల, యాదమరి, తవణంపల్లి మండలాలు కలిసి ఉండేవి, పునర్విభజన తర్వాత చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల మండలాలు మాత్రమే ఈ నియోజకవర్గ పరిధిలోకి వచ్చాయి. జిల్లా కేంద్రమైన ప్రాంతం చిత్తూరు నగరంగా ఉండగా మిగిలిన రెండు మండలాలు గ్రామీణ ప్రాంతానికి చెందినవే. చిత్తూరు నియోజవర్గం గతంలో తమిళనాడులో ఉంది. సరిహద్దులో ఉన్న నేపథ్యంలో తమిళ సంస్కృతి ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం నియోజకవర్గంలో

గురజాల జగన్మోహన్ (టీడీపీ)

టిక్కీ రాయల్ (కాంగ్రెస్)

విజయానంద రెడ్డి (వైసీపీ)

2,01,524 మంది ఓటర్లు ఉన్నారు.

రాజకీయ ఉద్దండులకు పేరుగాంచిన ఈ నియోజకవర్గంలో హోరాహోరీ పోరు నెలకొంది. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా జంగాలపల్లి శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఏఎస్ మనోహర్ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో జంగాలపల్లి శ్రీనివాసులు గెలిచారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా విజయానంద రెడ్డి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గురజాల జగన్మోహన్, కాంగ్రెస్ అభ్యర్థిగా టిక్కి రాయల్ పోటీలో ఉన్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులు బలమైన సామాజిక వర్గాల వారు కావడంతో పోటీ రసవత్తరంగా మారింది. టీడీపీ, వైసీపీ మధ్య ప్రధానంగా పోటీ ఉండబోతోందిగానీ గెలుపోటములను కాంగ్రెస్ పార్టీ ప్రభావం చూపే అవకాశం ఉంది. విజయానంద రెడ్డి, గురజాల జగన్మోహన్ ఆర్థికంగా బలంగా ఉండటంతో వీరిద్దరు ప్రచారంలో దూసుకుపోతున్నారు. పోటాపోటీగా సేవా కార్యక్రమాలు నిర్వహిసున్నారు. గత ఎన్నికల్లో గెలిచిన జంగాలపల్లి శ్రీనివాసులను కాదని విజయానంద రెడ్డికి వైసీపీ టికెట్ ఇచ్చింది. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీనివాసులు ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. జనసేన అభ్యర్థిగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో బలిజ తమిళ సామాజిక వర్గాల ఓటర్లు అధికం. విజయానంద రెడ్డి గెలుపు కోసం మేయర్ అముదతో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రమే ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేత మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బుల్లెట్ సురేశ్ కుప్పానికే పరిమితమయ్యారు. ఎన్డీయే కూటమి తరపు పోటీలో ఉన్న గురజాల జగన్మోహన్ తరపున మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు చిత్తూరు నగర మాజీ మేయర్ కటారి హేమలత, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి టిక్కీ రాయల్... బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు. సీపీఐ, సీపీఎం మద్దతిస్తున్న నాయకులు. ఎన్‌పీ చంగ్రాయ నాయుడు, డీకే ఆది కేశవ నాయుడు వంటి రాజకీయ ఉద్దండుల గడ్డ చిత్తూరు ప్రాంత వాసులు ఈసారి ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి.

(విశాలాంధ్ర-చిత్తూరు)

నామినేషన్లకు 'సువిధ'

- అభ్యర్థుల కోసం అందుబాటులోకి కొత్త యాప్
- ఇంటి నుంచే పత్రాల సమర్పణకు ఈసీ అవకాశం

ఆంధ్రప్రదేశ్ నుంచి లోక్‌సభ, అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థులంతా తమ నామినేషన్లు ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 'సువిధ' యాప్‌ను ఇందుకోసం ఏర్పాటు చేసింది. ఈ యాప్ సాయంతో అభ్యర్థి తన ఇంటి నుంచే నామినేషన్ వేయవచ్చు. ఆధునిక సాంకేతికతతో నామినేషన్ల ప్రక్రియలో నూతన ఒరవడులు వస్తున్నాయి. గత ఎన్నికలను పరిశీలిస్తే అభ్యర్థుల నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, వాటిని చించివేయడం తదితర ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా ఫ్యాక్షనిస్టు గ్రామాల్లో ఇలాంటివి జరిగాయి. దీంతో సువిధ యాప్‌ను అభ్యర్థుల సౌకర్యార్థం తీసుకొచ్చారు. సువిధ యాప్‌ను అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు లేదా ఈసీ వెబ్‌సైట్ ద్వారా తమ సెల్ నంబరు, నియోజకవర్గ వివరాలతో లాగిన్ చేయిచ్చు. ఆన్‌లైన్ నామినేషన్ కోసం సంబంధిత పత్రాల్లో అన్ని వివరాలను నింపాలి. సమగ్ర సమాచారంతో పాటు ఫారం 26 (అఫిడవిట్) ప్రతులను అప్‌లోడ్ చేయాలి. ఇందుకోసం సువిధ.ఈసీఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను ఎన్నికల సంఘం రూపొందించింది.

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఆన్‌లైన్‌లో మాత్రం ఒక రోజు ముందుగానే నామినేషన్ల గడువును ముగిస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తు, సంబంధిత రుజువు చేసే ధ్రువీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వాటిని నిర్ణీత సమయంలోగా సంబంధిత లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలకు నేరుగా అందజేయాలి. లేకపోతే నామినేషన్లు తిరస్కరిస్తారు. సంబంధిత అసెంబ్లీ లేదా లోక్‌సభ పరిధిలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నేరుగా నామినేషన్లు వేసే వారంతా 18వ తేదీ నుంచి ఉదయం 11-మధ్యాహ్నం 3 గంటలలోపు ఆర్‌వో కార్యాలయానికి వెళ్లాలి. నామినేషన్ కోసం సమీప రిటర్నింగ్ కార్యాలయం నుంచి 13 రకాల పత్రాలు తీసుకోవాలి. అభ్యర్థి నుంచి గరిష్ఠంగా నాలుగు సెట్లు స్వీకరిస్తారు. అసెంబ్లీ లేదా లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థి రెండు స్థానాల్లో మాత్రమే పోటీ చేయాలి. నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోకి మూడు వాహనాలనే అనుమతిస్తారు. అభ్యర్థి కచ్చితంగా ఫారం 26(అఫిడవిట్) సమర్పించాలి. ఫారం 26 అనగా... అభ్యర్థులు తమ కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పులతోపాటు క్రిమినల్ కేసులు, న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలు వెల్లడించాలి. ఈపత్రంపై స్టాంప్ విలువ రూ.10 కంటే అధికంగా ఉండాలి. అది అందుబాటులో లేకపోతేగనుక మాత్రం రూ.10 స్టాంఫ్ పేపరును అనుమతిస్తారు. నామినేషన్ దాఖలప్పుడు రిటర్నింగ్ అధికారి గదిలోకి అభ్యర్థితో కలిసి ఐదుగురిని అనుమతిస్తారు. లోక్‌సభ అభ్యర్థి రూ.25వేలు, అసెంబ్లీ అభ్యర్థి రూ.10వేలు చొప్పున ఫీజు చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ రుసుములో 50శాతం రాయితీ ఉంటుంది. అందుకోసం వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ఎన్నికల సంఘం గుర్తించిన పార్టీల అభ్యర్థికి స్థానికంగా ఉండే ఒక ఓటరు ప్రతిపాదిస్తూ సంతకం చేయాలి. స్వతంత్రులు లేక గుర్తింపు లేని పార్టీ అభ్యర్థిని 10 మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది. ఒక ఓటరు ఎంతమంది అభ్యర్థులకైనా ప్రతిపాదించడానికి ఎన్నికల సంఘం అనుమతించింది. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులైతే నామినేషన్ దరఖాస్తులో ఎన్నికల గుర్తును పేర్కొనాలి. మిగతా అభ్యర్థులైతే ఫ్రీ సింబల్స్ నుంచి తనకు నచ్చిన మూడు గుర్తులను ఎంపిక చేసుకోవచ్చు.

(విశాలాంధ్ర బ్యూరో-అమరావతి)

ఆదోనిలో ముక్కోణ పోటీ

హ్యాట్రిక్ కోసం వైసీపీ అభ్యర్థి యత్నం

కాంగ్రెస్, బీజేపీ ప్రచారం

కర్నూలు జిల్లా ఆదోనిలో త్రిముఖ పోరు జరగబోతోంది. వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ మధ్య రసవత్తర పోరు సాగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. స్థానికులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు వైసీపీ అభ్యర్థి వై.సాయిప్రసాద్ రెడ్డి హ్యాట్రిక్ విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈయన 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మీనాక్షి నాయుడుపై వరుస విజయాలు నమోదు చేశారు. ఎన్డీయే కూటమిలో భాగంగా బీజేపీకి సీటు కేటాయించడంతో బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారధికి టీడీపీ, జనసేన మద్దతిస్తున్నాయి. వైసీపీ ఒంటరిగా బరిలోకి దిగింది. ఇండియా కూటమి తరపున సీపీఐ, సీపీఎం బలపరచిన కాంగ్రెస్ అభ్యర్థి రమేశ్‌యాదవ్ పోటీ చేస్తున్నారు. దీంతో ఆదోనిలో ముక్కోణం పోటీ జరుగబోతోంది. కమ్యూనిస్టుల మద్దతుతో ప్రధాన పార్టీలకు దీటుగా రమేశ్ యాదవ్ గెలుపు దీమాతో ప్రచారం చేస్తున్నారు. వైసీపీ, ఎన్డీయే కూటమి తరపున అభ్యర్థులు కూడా పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఎవరికి వారు గెలుపు తమదేనన్న దీమా వ్యక్తంచేస్తున్నారు.

కాగా, అదోనికి రెండవ ముంబైగా పేరుంది. హోల్‌సేల్ వస్త్రవ్యాపారికి ప్రసిద్ధి. తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారం చేస్తుంటారు. అలాగే కర్నాటక చిరు వర్తకులు కూడా అదోని నుంచి వస్త్రాలు కొనుగోలు చేస్తుంటారు. అదోని ద్విసభ్య నియోజకవర్గం కాగా ఇది 1952లో ఏర్పడింది. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఏడు సార్లు, టీడీపీ నాలుగు సార్లు, వైసీపీ రెండు సార్లు, స్వతంత్రలు రెండు సార్లు, పీఎస్పీ ఒకసారి చొప్పున గెలిచాయి. 1952 ఎన్నికల్లో ఒక స్థానాన్ని కాంగ్రెస్, అభ్యర్థి మరొక స్థానాన్ని స్వతంత్ర అభ్యర్థి గెలుచుకున్నారు. 1955లో పీఎస్పీ అభ్యర్థి, 1962లో స్వతంత్రంగా పోటీ చేసిన సీతారామిరెడ్డి విజయం సాధించారు. 1967లో టీజీఎల్ తిమ్మయ్య కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 1972, 1978 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి సత్యనారాయణ వరుస విజయాలు నమోదు చేశారు. ఆవిర్భావం తర్వాత టీడీపీ మొదటిసారి పోటీ చేసినప్పుడు ఆ పార్టీ అభ్యర్థి ఎస్.ప్రకాశ్‌జైన్... కాంగ్రెస్ అభ్యర్థి సత్యనారాయణపై విజయం సాధించారు. 1984,1989 ఎన్నికలలో రాచోటి రామయ్య కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఎన్నికల్లో టీడీపీ తరపున కె.మీనాక్షినాయుడు గెలిచారు. 2004లో టీడీపీ అభ్యర్థి గుడిసే కృష్ణమ్మపై కాంగ్రెస్ అభ్యర్థి వై.సాయిప్రసాద్ రెడ్డి విజయం సాధించారు. 2009లో టీడీపీ అభ్యర్థి కె.మీనాక్షినాయుడు గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డిపై 256 ఓట్లతో స్వల్ప మెజారిటీ సాధించారు. 2014లో వైసీపీ అవిర్భావించింది. సాయిప్రసాద్ రెడ్డి 2014, 2019 ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి కె.మీనాక్షినాయుడుపై రెండుసార్లు విజయం నమోదు చేశారు. తాజా ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని ఆకాంక్షిస్తున్నారు.

వై. సాయిప్రసాద్‌రెడ్డి

రమేష్ యాదవ్

పార్థసారధి

(విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు)